Crime Mirror
QR Code


https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption

హైదరాబాద్
10-10-2024
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:12
సంచిక: 338

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# వ్యాపార దిగ్గజం.. 'రతన్ టాటా' అస్తమయం



### దేశ పారిశ్రామిక రంగానికి దశ దిశ చూపిన ధీశాలి
### ఆదాయంలో 65 శాతం దాతృత్వానికే..
### కరోనాపై పోరుకు రూ.1,500 కోట్లు విరాళమిచ్చిన
### వితరణశీలి అనితర సాధ్యుడు

ప్రముఖ పారిశ్రామిక దిగ్గజం, టాటా సన్స్ గౌరవ చైర్మన్ రతన్ నావల్ టాటా బుధవారం రాత్రి 11.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. టాటా వ్యాపార సామ్రాజ్యాన్ని దేశవిదేశాల్లో విస్తరించి.. పేదవాడి కారు కలను తీర్చాలని 'నానో' తెచ్చిన టాటా.. గొప్ప వితరణశీలి. యువతకు ఆదర్శప్రాయుడు. విలువలపై వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన దార్శనికుడు. ఆయన చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కన్నుమూశారు. రతన్ టాటా లేరన్నది నేను అంగీకరించలేక పోతున్నా.

# సమాజానికి సమర్థులైన పౌరులను అందించండి

## వారిని తీర్చి దిద్దే బాధ్యత టీచర్లుగా మీపైనే ఉంది



- సమాజంలో బడులే కీలక భూమిక పోషించాలి
- కొలివి దయ్యాన్ని నమ్ముకోవడం వల్లనే ఉద్యోగాలు రాలే
- ప్రభుత్వ పాఠశాలల పనితీరు మెరుగు పర్చేలా చర్యలు
- డిఎస్సీ నియాక పత్రాల అందచేతలో సిఎం రేవంత్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సమర్థులైన పౌరులను తీర్చిదిద్దే బాధ్యత కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న టీచర్లపైనే ఉందని, పాఠశాలలు అందుకు వేదిక కావాలని సిఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మీకు వచ్చిన ఈ బాధ్యతను సమర్థంగా ఉపయోగించి సమాజానికి మంచి పౌరులను అందించాలన్నారు. కెసిఆర్ ఇంట్లో ఉద్యోగాలు ఊడగొట్టడం వల్లనే ఇవాళ తెలంగాణలో కొలువుల జాతర సాగుతోందన్నారు. డీఎస్సీ విజేతలను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్లు అనిపిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టీచర్లే తెలంగాణ వారధులు..

మిగతా 2లో

## గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్ విడుదల

### 21 నుంచి 27 వరకు మెయిన్ పరీక్షలు
### మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు నిర్వహణ

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో 'గ్రూప్-1' మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది.




## మీ రాజకీయ పునరాగమనం
# అభినందనీయం


### కాశ్మీర్ సిఎంగా మళ్లీ కాబోతున్నందుకు అభినందనలు
### ఎక్స్ వేదికగా ఒమర్ అబ్దుల్లాను ప్రశంసించిన కెటిఆర్
### యువతకు మోసం చేశారంటూ రాహుల్‌పై విమర్శలు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కాశ్మీర్ ఎన్నికల్లో విజయం సాధించిన ఒమర్ అబ్దుల్లాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. అద్భుతమైన పునరాగమనం చేశారంటూ.. కితాబు ఇచ్చారు. 'వారు చెప్పినట్లు, మీరు మీ పునరాగమనం ఎదురుదెబ్బ కంటే మెరుగ్గా ఉండేలా చూసుకున్నారు..భారతదేశంలోని అత్యంత అందమైన రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నం దుకు శుభాకాంక్షలు అంటూ కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేటీఆర్ ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. రాహుల్ జీ, యువతకు ఇచ్చిన హామీలు అమలు చేసినందుకు ధన్యవాదములు.. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు అందించినందుకు ధన్యవాదాలు చెప్పటానికి అశోక్ నగర్ యువత వేచి ఉన్నారు.. 5 లక్షల యువ వికాసం సహాయం, పునరుద్ధరణకు కూడా ధన్యవాదాలు.. మీ హామీ పూర్తయినందున యువకులను కలవడానికి తిరిగి హైదరాబాద్‌కు రావడానికి స్వాగతం అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా సెటైర్లు వేశారు. ఈగా కర్ణాటకలో ఐదు, తెలంగాణలో

2లో

# ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు యదాతథం

### రెపోరేటు తగ్గింపునకు ఆర్‌బిఐ విముఖం
### విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే నిర్ణయాలు
### వివరాలు వెల్లడించిన గవర్నర్ శక్తికాంత్ దాస్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** విశ్లేషకుల అంచనాలకు అనుగుణంగానే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశ నిర్ణయాలను గవర్నర్ శక్తికాంత దాస్ బుధవారం ప్రకటించారు. రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. 2023 ఫిబ్రవరి నుంచి కేంద్ర బ్యాంకు ఈ రేటును ఇలాగే కొనసాగిస్తూ వస్తోంది. ఎలాంటి మార్పు చేయకపోవడం వరుసగా ఇది పదోసారి. 2024-25లో వాస్తవ జీడీపీ వృద్ధిరేటు అంచనా 7.2 శాతం. రెండో త్రైమాసికంలో 7 శాతం, మూడు, నాలుగో త్రైమాసికంలో 7.4శాతంగా ఉండే అవకాశం.



## కాంగ్రెస్‌వన్నీ విభజన రాజకీయాలు

2లో

### హర్యానా ఫలితాలపై వక్రభాష్యాలు
### మండిపడ్డ ప్రధాని మోడీ

**ముంబయి, (క్రైమ్ మిర్రర్):** సమాజంలో కాంగ్రెస్ విష బీజాలు నాటుతూ..హిందువులను విభజించాలని చూస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ తీరును విమర్శిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నా రని దుయ్యబట్టారు.



2లో

# దుర్గమ్మను దర్శించుకున్న చంద్రబాబు దంపతులు

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సిఎం
- నదుల అనుసంధానం త్వరగా పూర్తి కావాలి
- కృష్ణాకు ఎప్పుడూ లేని విధంగా వరదలు
- అమ్మవారే కాపాడాలని మొక్కుకున్నా

**విజయవాడ,(క్రైమ్ మిర్రర్):** రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. బుధవారం సతీసమేతంగా దుర్గమ్మకు సీఎం పట్టువస్త్రాలు సమర్పించారు. భువనేశ్వరి, లోకేశ్ దంపతులు కూడా పాల్గొన్నారు.





# దుర్గమ్మను దర్శించుకున్న చంద్రబాబు దంపతులు

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పుడూ ఊహించని విధంగా కృష్ణానదికి వరద వచ్చిందన్నారు. త్వరలోనే కృష్ణ, పోలవరం, నదుల అనుసంధానం ఉంటుందని.. అమ్మ దయ వలన త్వరలో పూర్తి చేయాలని దుర్గమ్మను కోరినట్లు చెప్పారు. మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన ప్రతి భక్తులకు లడ్డు ప్రసాదం ఉచితంగా ఇస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు.అమ్మవారి దర్శనానంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ.. అమ్మవారి జన్మనక్షత్రం అయిన ఈ రోజు అమ్మవారిని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు పెట్టడం ఆనవాయితీ అని చెప్పుకొచ్చారు. తిరుపతి తరవాత రెండో అతిపెద్ద దేవాలయం దుర్గగుడి అని తెలిపారు. దేవాలయాల్లో పవిత్రతను కాపాడుకోవడం అందరి బాధ్యత అని అన్నారు.ఈసారి ఉత్సవ కమిటీ కాకుండా సేవ కమిటీ వేశామన్నారు. ఉత్సవాల్లో భాగంగా నిన్నటి వరకు 5,85,651 భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారన్నారు. 67931 మంది భక్తులు ఈ రోజు మధ్యాహ్నం 3 గంటల వరకూ అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. దసరాకు దేవాదాయశాఖ తరుపున ఏర్పాట్లు బాగా చేశారన్నారు. ఈసారి దసరాలో సామాన్య భక్తులకు పెద్దపీట వేశామని తెలిపారు. బుధవారం దుర్గమ్మ ఆలయానికి చేరుకున్న సీఎంకు ఆలయ అర్చకులు , దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చిన్నరాజగోపురం వద్ద సీఎం చంద్రబాబు తలకు ఆలయ అర్చకులు పరివేష్టం చుట్టారు. ఆపై మేళతాళాల నడుమ ప్రభుత్వం తరపున దుర్గమ్మకు సతీసమేతంగా సీఎం పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం సరస్వతీ అలంకరణలో ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అంతకుముందుకు ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఇటీవల వర్షాలకు ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్డు పరిసరాల్లో దెబ్బతిన్న ప్రాంతాలు, పునరుద్ధరణ తర్వాత ఫోటోలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఫోటో ఎగ్జిబిషన్‌ను ముఖ్యమంత్రి తిలకించారు. సీఎం చంద్రబాబుతో పాటు దుర్గమ్మను మంత్రులు నారాలోకేష్, ఎంపీ కేశినేని చిన్ని, మంత్రులు కొల్లు రవీంద్ర ఎమ్మెల్యే సుజన చౌదరి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, విజయవాడ నగర కమిషనర్ రాజశేఖర్ బాబు, ఆలయ ఈఓ కేఎస్ రామారావు, దేవాదాయ శాఖ అధికారులు దర్శించుకున్నారు.

# ఆర్‌బిఐ కీలక వడ్డీరేట్లు యదాతథం

(మొదటి పేజీ తరువాయి)




2025-26 ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌లో 7.3శాతంగా వృద్ధి రేటు అంచనా వేసింది. మెరుగైన వర్షపాతం నమోదు, సరిపడా నిల్వలతో ఈ ఏడాది చివరికి ఆహార ద్రవ్యోల్బణం తగ్గే అవకాశం ఉంది. సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం భారీగా పెరగొచ్చని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.5శాతంగా ఉండే అవకాశం ఉంది. తయారీ ఖర్చులు తగ్గడం, ప్రభుత్వ విధానాలు, దేశీయంగా పెరుగుతున్న డిమాండ్ తదితర కారణాలతో తయారీ రంగం వృద్ధి చెందుతోంది. ఆర్థిక రంగం స్థిరంగా ఉంది. బ్యాంకుల కార్యకలాపాలు బలంగా ఉన్నాయి. యూపీఐ లైట్ వాలెట్ పరిమితి రూ.2000 నుంచి రూ.5వేలకు పెంపు దేశంలోని సామాన్య ప్రజలకు ఈసారి కూడా ఉపశమనం లేదు. ఇఓఎల పెనుభారం తగ్గలేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా , తన పాలసీ రేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. యథాతథంగా, 6.50 శాతం వద్ద కొనసాగించింది. గత ఏడాది ఫిబ్రవరి నుంచి రిజర్వ్ బ్యాంక్ తన రెపో రేటును అలాగే కొనసాగిస్తూ వస్తోంది. రెపో రేట్‌లో ఎలాంటి మార్పు చేయకుండా, యథతథంగా కొనసాగించడం వరుసగా ఇది పదో సారి. 2024లో ఇది వరుసగా ఐదోసారి. ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడించారు. మానిటరీ పాలసీ కమిటీలోని ఆరుగురు సభ్యుల్లో ఐదుగురు రెపో రేటు తగ్గింపును వ్యతిరేకించారు. దేశంలో రెపో రేటును తగ్గించకూడదంటూ ఐదుగురు సభ్యులు ఓటు వేసినట్లు ఆర్బీఐ గవర్నర్ వెల్లడించారు. ఈ ఏడాది జులై, ఆగస్టు నెలల్లో రిటైల్ ద్రవ్యోల్బణం, 4 శాతం కంటే తక్కువగానే ఉన్నప్పటికీ, రెపో రేటులో కేంద్ర బ్యాంక్ ఎటువంటి మార్పు చేయలేదు. రెపో రేట్‌లో మార్పు ఉండదని మార్కెట్ ముందు నుంచీ ఊహిస్తోంది కాబట్టి, ఇదేమీ ఆశ్చర్యకరమైన నిర్ణయం కాదు.్ర ÷పో రేట్ మారదని ముందు నుంచి సిద్ధమైన మార్కెట్, ఆర్‌బీఐ గవర్నర్ ప్రసంగంపై మాత్రం నిశితంగా దృష్టి పెట్టింది. భవిష్యత్ కార్యాచరణ గురించి ఆయన ఏం చెబుతారన్నది ఇటు సామాన్య ప్రజలకు, అటు కార్పొరేట్లకు చాలా కీలకం. దేశ ఆర్థిక వ్యవస్థకు మార్గనిర్దేశర చేసే వ్యాఖ్యలు గవర్నర్ ప్రసంగంలో ఉంటాయి కాబట్టి, ఆయన మాటలను అర్థం చేసుకోవడం ముఖ్యం. ద్రవ్యోల్బణానికి ప్రపంచ ఉద్రిక్తతలు అతి పెద్ద ముప్పుగా పరిణమించాయని అన్నారు. లోహాలు, ఆహార పదార్థాల ధరల్లో ఇటీవలి పెరుగుదల కారణంగా రిటైల్ ద్రవ్యోల్బణం ప్రమాదంలో ఉంది. 2024 జులై, ఆగస్టు నెలల్లో ప్రధాన ద్రవ్యోల్బణం పెరిగిందని, బేస్ ఎఫెక్ట్ కారణంగా చిల్లర ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశంలో చిల్లర ద్రవ్యోల్బణం సగటున 4.5 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ గవర్నర్ అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (జులై-సెప్టెంబర్) ద్రవ్యోల్బణం 4.1 శాతంగా, మూడో త్రైమాసికంలో (అక్టోబర్-డిసెంబర్) 4.8 శాతం, నాలుగో త్రైమాసికంలో (జనవరి-మార్చి) 4.2 శాతం ఉండొచ్చని చెప్పారు. దేశంలో ద్రవ్యోల్బణం రేటును అదుపులో ఉంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇన్‌ఫ్లేషన్ అదుపులో ఉన్నట్లు కనిపించినప్పటికీ, ఆహార ద్రవ్యోల్బణం మాత్రం ఇప్పటికీ లక్ష్యానికి మించి ఉంది. అంటే, దేశంలో ఆహార పదార్థాల ధరలు అదుపులో లేవు. అందుకే, రెపో రేటును 6.50 శాతంగా కొనసాగించాలని కేంద్ర బ్యాంక్ నిర్ణయించింది. రెపో రేట్ తగ్గితే, బ్యాంక్ రుణాలపై వడ్డీ రేట్లు కూడా తగ్గుతాయి. రెపో రేట్ తగ్గించక పోవడంతో, కోట్లాది మంది రుణగ్రహీతలు, బ్యాంకు ఖాతాదార్లు నిరాశకు గురయ్యారు.

# వ్యాపార దిగ్గజం.. 'రతన్ టాటా' అస్తమయం

(మొదటి పేజీ తరువాయి)

భారతదేశ ఆర్థిక వ్యవస్థ ముందడుగులో ఉంది. మనం ఈ స్థానంలో ఉండటానికి రతన్ జీవితం, పని తీరుతో చాలా సంబంధం కలిగి ఉంది. ఈ సమయంలో అతని మార్గదర్శకత్వం అమూల్యం. మన ఆర్థిక సంపద, విజయాలకు ఆయన సేవలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. లెజెండ్స్‌కి మరణం లేదు.ముంబై: ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ నావల్ టాటా బుధవారం రాత్రి 11.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. టాటా వ్యాపార సామ్రాజ్యాన్ని దేశవిదేశాల్లో విస్తరించి.. పేదవాడి కారు కలను తీర్చాలని 'నానో' తెచ్చిన టాటా గొప్ప వితరణశీలి. యువతకు ఆదర్శప్రాయుడు. విలువలపై వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన దార్శనికుడు. ఆయన చాలా రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆయన వయసు 86 ఏళ్లు. రతన్ టాటా మృతిని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ధ్రువీకరించారు. ఆయన తనకు గొప్ప మిత్రుడు, గురువు, మార్గదర్శకుడు అని చెప్పారు. రతన్ టాటా మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సంతాపం ప్రకటించారు. ఆయనొక విజనరీ బిజినెస్ లీడర్, అసాధారణమైన వ్యక్తి అని కొనియాడారు. దేశంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక వ్యాపార సంస్థలకు సుస్థిరమైన నాయకత్వాన్ని అందించారని చెప్పారు. మెరుగైన సమాజం కోసం కృషి చేశారని, ఎన్నో సేవా కార్యక్రమాలకు చేయూత అందించారని గుర్తుచేశారు. విద్యా, వైద్యం, పారిశుధ్యం, జంతు సంరక్షణ తదితర రంగాల్లో విశేషమైన సేవలు అందించారని పేర్కొన్నారు. విశిష్టమైన వ్యక్తిత్వంతో ఎంతోమందికి ఆప్తుడైన రతన్ టాటా దూరం కావడం చాలా బాధాకరమని ఉద్ఘాటించారు. రతన్ టాటా కుటుంబానికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు. రతన్ టాటా ఒక టైటాన్' అని ప్రశంసిస్తూ వ్యాపారవేత్త హర్ష్ గోయెంకా 'ఎక్స్'లో పోస్టు చేశారు. రతన్ టాటా ఇక లేరు అనే నిజాన్ని తాను అంగీకరించలేకపోతున్నానని ఆనంద్ మహీంద్రా పేర్కొన్నారు. రతన్



టాటా 1937 డిసెంబర్ 28న ముంబైలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు నావల్ టాటా, సూనూ టాటా. ముంబై, సిమ్లాలో విద్యాభ్యాసం చేశారు. అమెరికాలోని కార్నెల్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చదివారు. అవివాహితుడైన రతన్ టాటా 1962లో టాటా సన్స్‌లో చేరారు. 1991 నుంచి 2012 దాకా, తర్వాత 2016 నుంచి 2017 టాటా సంస్థ ఛైర్మన్‌గా సేవలందించారు. పారిశ్రామిక రంగానికి అందించిన సేవలకు గాను రతన్ టాటాను భారత ప్రభుత్వం 2000 సంవత్సరంలో పద్మభూషణ్, 2008లో పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది. రతన్ టాటా వితరణశీలిగా పేరుగాంచారు.

# సమాజానికి సమర్ధులైన పౌరులను అందించండి



(మొదటి పేజీ తరువాయి)

నిర్మాతలని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలను సిఎం రేవంత్ స్వయంగా అందజేసారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ కొత్త టీచర్లకు కీలక సూచనలు చేశారు. తెలంగాణలో 30వేల పాఠశాలలు ఉంటే.. 24లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే 34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ బడికి వెళ్లడమంటేనే గ్రామాల్లో సైతం నామోషీగా భావిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి పోయిన వారు కూడా తాము తిన్నా తినకపోయినా, పుస్తెలు అమ్మి అయినా తమ పిల్లలను ప్రైవేటు బడి, కాన్వెంట్‌కు పంపాలనుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలకు పంపాలంటే.. ఎందుకు ఇబ్బందిపడుతున్నారో ఆలోచించండి. మీకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటా.. కానీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మీరు కృషిచేయండని సూచించారు. నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలన్నారు. తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిని భవిష్యత్తులో డాక్టర్లుగా, లాయర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కార్పొరేట్ బడిలో చదువుకోలేదు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి. స్కూళ్లలో అన్ని వసతులూ కల్పించేందుకు కృషిచేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 11న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శ్రీకారం చుడుతున్నాం. విద్యకు బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాం. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరిస్తున్నాం అని అన్నారు. ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. రెండుసార్లు కోరి కొలువి దెయ్యాన్ని తెచ్చుకున్నట్లుగా బీఆర్ఎస్‌కు అధికారం ఇచ్చాం. ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశించినా.. తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్లకు నియామక పక్రియ పూర్తి చేశారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు తీర్చలేదు. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యోగాలు ఊడాలని గతంలో చెప్పాను. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారు. 90 రోజుల్లో 30వేల కొలువులు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశాం. 65 రోజుల్లో డీఎస్సీ నియామక పక్రియ పూర్తి చేశాం అని వివరించారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వ బడుల పాత్ర కీలకం. డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవాలని కొరివి దెయ్యాలు యత్నించాయి. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవడానికి కుట్రలు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భవిష్యత్తు తరాలకు టీచర్లు ఆదర్శంగా మారబోతున్నారు. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కళ్లల్లో కారం పెట్టుకొంటారు. ఎంపీగా కవిత ఓడిపోగానే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కుమార్తెకు మాత్రం 6 నెలల్లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల మేలు కోసం విశ్రాంతి తీసుకోకుండా శ్రమిస్తున్నాం. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలి. తెలంగాణ సమాజంపై బీఆర్ఎస్‌కు ఎందుకంత కోపం? ఏడు లోక్‌సభ స్థానాల్లో బీఆర్ఎస్‌కు డిపాజిట్లు పోయాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. మా ప్రభుత్వాన్ని పడగొడతామని బీఆర్ఎస్ అంటోంది.. ఇది న్యాయమా? బీఆర్ఎస్‌కు అధికారం రాదు.. తెలంగాణ ప్రజలు ఇవ్వరని మరోమారు స్పష్టం చేశారు. విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తాం. రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నారు.

## గ్రూప్-1 మెయిన్స్ షెడ్యూల్ విడుదల

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబరు 21 నుంచి 27వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించ నున్నారు. ఆయాతేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగ నున్నాయి. అయితే మధ్యాహ్నం 12:30 నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించనున్నారు. మధ్యాహ్నం1.30 తర్వాత అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించరు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను అక్టోబరు 14 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌లో పొందుపరిచిన అన్ని నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. జూన్ 9న గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఎగ్జామ్ కు మొత్తం 3.02 లక్షల మందికిపైగా అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్ష ఫలితాలను జులై 7న విడుదల చేశారు. ఇందులో 31,382 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు అర్హత సాధించారు. వీరికి అక్టోబరు 21 నుంచి మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. గ్రూప్-1 మెయిన్స్‌లో మొత్తం 6 పేపర్లు ఉంటాయి. ప్రతీ పేపర్‌ను 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 3 గంటలు. మెయిన్ పరీక్షలను ప్రతీ రోజు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహిస్తారు. మెయిన్ పరీక్షలో జనరల్ ఇంగ్లిష్ తప్ప మిగిలిన పేపర్లను అభ్యర్థులు ఎంచుకున్న భాషల్లో రాయాలి. గ్రూప్-1 మెయిన్స్ లో మొత్తం 06 పేపర్లు ఉంటాయి.

## మీ రాజకీయ పునరాగమనం అభినందనీయం

(మొదటి పేజీ తరువాయి)

ఆరు గ్యారెంటీలంటూ అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్.. హరియాణలో ఏడు గ్యారెంటీలని మభ్యపెట్టే ప్రయత్నాన్ని ఆ రాష్ట్ర ప్రజలు తిరస్కరించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హామీల అమలులో కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని దేశం మొత్తం గమనిస్తోందనడానికి ఈ ఎన్నికల ఫలితాలు నిదర్శనమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో రాష్ట్ర ఎన్నికల్లో ఒక్కో గ్యారెంటీ పెంచుకుంటూ గారడీ చేద్దామని చూసిన కాంగ్రెస్ బొక్కబోర్లా పడిందని ఎద్దేవా చేశారు. హరియాణలో కాంగ్రెస్ ఓటమితోనైనా రాహుల్ గాంధీ బుద్ధి తెచ్చుకోవాలని, చెప్పేమాటలకు చేస్తున్న పనులకు పొంతన లేనప్పుడు ఇలాంటి చెంపపెట్టులాంటి ఫలితాలు తప్పవన్నారు. బుల్డోజర్‌రాజ్, పార్టీ ఫిరాయింపులు, రాజ్యాంగ పరిరక్షణ పేరుతో ఆయన చేసిన డ్రామాలకు హరియాణ ప్రజలు తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు. సోషల్ మీడియా విస్తృతి పెరిగిన ఈ రోజుల్లో రాష్ట్రాలు వేరైనా ప్రజల నుంచి వాస్తవాలు దాచడం సాధ్యంకాదన్నారు. కాంగ్రె?సతో హోరాహోరీ ఉన్న రాష్ట్రాల్లోన్రె బీజేపీ గెలుస్తోందని, ఆ పార్టీ ఓటమికి రాహుల్‌గాంధీ బలహీన నాయకత్వంకూడా ఓ ప్రధాన కారణమన్నారు. బీజేపీని ఢీకొని నిలువరించే శక్తి కేవలం ప్రాంతీయ పార్టీలకు మాత్రమే ఉందన్న విషయం ఆయా రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికలను చూస్తే అర్థమైపోతుందని తెలిపారు. మరోవైపు.. ప్రభుత్వ శాఖల్లో పనిచేసే చిరుద్యోగులు వేతనాలు రాక విలవిలలాడుతున్నారని, ఈ దండగమారి పాలనలో పండుగపూట వారంతా పస్తులు ఉండాల్సిందేనా? అని కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఐదారునెలలుగా జీతాల్లేవని, పంచాయతీ వర్కర్లు, మునిసిపాలిటీ కార్మికులు, ఆస్పత్రి సిబ్బంది, హాస్టల్ వర్కర్లు, గెస్ట్ లెక్చరర్లు.. ఇలా ప్రతీశాఖలో వేతనాల పెండింగ్ ఉందన్నారు. ఆయా ఉద్యోగులు తమ కుటుంబాలను నెట్టుకురావడానికి అప్పులుచేసి తిప్పలు పడుతున్నారని పేర్కొన్నారు. ఒకటో తేదీనే జీతాలిస్తామన్న మీ ప్రగల్భాలు ఏమయ్యాయని నిలదీశారు. ఉద్యోగుల అవస్థను గుర్తించి తక్షణం వేతనాలు చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్‌వన్నీ విభజన రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

హరియాణా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయాన్ని ప్రస్తావిస్తూ, అక్కడ కాంగ్రెస్ చేసిన కుట్రలన్నీ విఫలమయ్యాయని అన్నారు. మహారాష్ట్రలో రూ.7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. హరియాణా ఎన్నికల్లో భాజపా చారిత్రాత్మక విజయం దేశ ప్రజల ఆలోచనను తెలియజేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు, దళితులు భాజపాకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ తమ రిజర్వేషన్లను లాక్కొని తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని దళితులు గ్రహించారు. దేశంలోని రైతులను కూడా కాంగ్రెస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ, తమకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఎవరు ఇచ్చారో హరియాణా రైతులకు తెలుసు కాబట్టే వారు భాజపాను గెలిపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెప్పారని మోదీ అన్నారు.

## ఎస్సీ వర్గీకరణ అమలుకు నిర్ణయం

### ఏకసభ్య కమిషన్ ఏర్పాటుకు సిఎం ఆదేశం



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం 60 రోజుల్లో నివేదిక ఇచ్చేలా ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ నివేదిక వచ్చాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని సీఎం సూచించారు. 24గంటల్లో కమిషన్‌కు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఉన్నత అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పించాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వివిధ అంశాలపై చర్చించిన క్యాబినెట్ సబ్ కమిటీ.. నాలుగోసారి సమావేశమై ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏకసభ్య న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు సమావేశమై చర్చించి ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. కేబినెట్ సబ్ కమిటీ సూచనల ఆధారంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఎస్సీ వర్గీకరణపై 60 రోజుల్లో వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ సమర్పించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. వన్ మెన్ కమిషన్ రిపోర్ట్ సమర్పించాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



## వరదబాధితులకు ఎల్ అండ్ టి భారీ విరాళం

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి నిధులు అందుతూనే ఉన్నాయి. తాజాగా ఎల్ అండ్ టీ సంస్థ రూ.5.50 కోట్ల భారీ విరాళం ఇచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ఎల్ అండ్ టీ ఛైర్మన్ కలిసి ఇందుకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సిఎం వారిని అభినందించారు.

## పండగ పండగా లేకుండా పోయింది

### యూపిలోనే అనుకుంటే..తెలంగాణలోనూ బుల్డోజర్లు

### రేవంత్ సర్కార్‌పై కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): రాష్ట్రంలో బతుకమ్మ బతుకమ్మ లాగా లేదు.. దసరా దసరా లాగా లేదు.. ఈ పండుగల వేళ బుల్డోజర్లతో భయానక వాతావరణం సృష్టించారని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్ పటేల్ సహా ఆయన అనుచరులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు. ఇప్పుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉంటే ఇప్పటికే రైతుల ఖాతాల్లోకి పైసలు, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు వచ్చేవి. ఈ సారి పండుగ పండుగ మాదిరిగా లేకుండా పోయింది. రాష్ట్రంలో పండుగ జరుపుకునే పరిస్థితి లేకుండా భయానక వాతావారణం సృష్టించారు. వరంగల్‌లో ఓ ఎమ్మార్వో బతుకమ్మ ఘాట్ చూసేందుకు వెళితే ఇళ్లు కూలగొట్టేందుకు వచ్చారనుకొని వాళ్లను స్థానికులు తరమికొట్టారు. అలా ఉంది రాష్ట్రంలో పరిస్థితి అని కేటీఆర్ తెలిపారు.యూపీలోనే బుల్డోజర్ సీఎం ఉన్నాడుకున్నాం. కానీ మన తెలంగాణలో కూడా ఇప్పుడు అలాంటి బుల్డోజర్ సంస్కృతిని తీసుకొచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆఘాయిత్యాలను చూసి ప్రతి ఒక్కరూ కేసీఆర్‌ను తలచుకుంటున్నారు. అరచేతిలో వైకుంఠం చూపించి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ పది నెలల వాళ్ల పాలనలో అన్ని వర్గాలు అసంతృప్తితో ఉన్నాయి. డిసెంబర్ 9 సోనియా గాంధీ బర్త్ డే రోజునే 2 లక్షలు రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ స్వయంగా హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ అమలు కాలేదని కేటీఆర్ గుర్తు చేశారు.

## బాసర సరస్వతీ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

### అమ్మవారి జన్మనక్షత్రం కావడంతో పోటెత్తిన భక్తులు

నిర్మల్, (క్రైమ్ మిర్రర్): బాసర సరస్వతీ దేవి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మూల నక్షత్ర పర్వదిన వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అమ్మవారి జన్మ నక్షత్రం కావడంతో భక్తులు భారీగా తరలి వస్తున్నారు. తెల్లవారు జాము రెండు గంటల నుంచే దర్శనాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్బంగా అక్షరాభ్యాస కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మండపాలు కిట కిట లాడుతున్నాయి. అమ్మవారి దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దక్షిణ భారతదేశంలోని ఏకైక చదువుల తల్లి కొలువైన బాసర క్షేత్రంలో మూల నక్షత్రం పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు. తమ పిల్లలకు అక్షరాభ్యాసాలు చరేయిస్తున్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం అర్ధరాత్రి మూల నక్షత్రం వస్తుందని, రెండు గంటల నుంచి ఆలయంలో అక్షరాభ్యాస పూజలను ప్రారంభించారు. తెల్లవారు జాము ఐదు గంటల నుంచి అమ్మవార్ల దర్శనానికి భక్తులు బారులు తీరారు. కాగా దేశంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవీ అమ్మవారి ఆలయం ఒకటి. అమ్మవారి సన్నిధిలో సాధారణంగా అక్షరాభ్యాసం టికెట్ 150 రూపాయలు, రూ.1000లుగా నిర్ణయించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అక్షరాభ్యాస పూజలకు, సర్వదర్శననికి వేరు వేరుగా క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. అలాగే ఆన్‌లైన్ టికెట్ల ప్రత్యేక అక్షరాభ్యాస క్యూలైన్లు, రూ.100, ప్రత్యేక దర్శనానికి క్యూ లైన్ ఆలయ అతిథి గృహాల వద్ద నుండి ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా మూల నక్షత్ర పర్వదిన వేడుకలు సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. అక్షరాభ్యాస పూజలు సర్వదర్శనాల క్యూ లైన్‌లో భక్తులకు పాలు, నీరు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. రెండు బయో టాయిలెట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే గోదావరి నది తీరాన అందుబాటులో 40 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు.

## సిఎం రేవంత్‌తో ఆదివాసీ సంఘాల భేటీ

### మంత్రి సీతక్కతో కలిసి వచ్చిన నేతలు

### సీఎం రేవంత్ దృష్టికి పలు సమస్యలు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఆదివాసి సంఘాలు భేటీ అయ్యాయి. జూబ్లీహిల్స్ లోని సీఎం అధికారిక నివాసంలో బుధవారం భేటీ అయిన పలు సంఘాల ప్రతినిధులు..తమ ప్రాంత సమస్యలను సీఎంకి వివరించారు. జైనూరు ఘటన దరిమిలా ఆదివాసులు, మైనారిటీ వర్గాల మధ్య సఖ్యత కుదుర్చేందుకు ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఇరు వర్గాలతో ఇప్పటికే పలు దఫాలుగా చర్చలు జరిపారు. దీనికి కొనసాగింపుగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చొరవ తీసుకొని ఆదివాసి సంఘాలను తోడ్కొని సీఎం రేవంత్ రెడ్డి తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తమ సమస్యలను ఆదిలాబాద్ ఆదివాసి సంఘాల ప్రతినిధులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. స్థానికంగా తమకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరిస్తూ వినతి పత్రాలు అంద చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులను కాపాడే విధంగా చర్యలు చేపట్టాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. తమ భూములు, ఉద్యోగాలు తమకే దక్కేలా చూడాలని కోరారు. ఆదివాసీల సమస్యలు సావధానంగా విన్న రేవంత్ రెడ్డి..దీపావళి లోపు సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశానికి ఆదివాసి సంఘాలను, ముఖ్యలను ఆహ్వానిస్తామని, ఆ సమావేశంలోనే ఆదివాసీల డిమాండ్ల సాధ్యసాధ్యాలను పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆదివాసి సంఘాలకు హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ కలెక్టర్ గా పనిచేసి అక్కడి సమస్య పట్ల పూర్తి అవగాహన ఉన్న దివ్య దేవరాజన్ ను అక్కడికి పంపించి చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంతోకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించెందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నందున ప్రభుత్వానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదివాసి సంఘాల ప్రతినిధులకు సూచించారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి, సమస్యను పరిష్కరించే దిశలో చూపి సీఎంతో సమావేశం ఏర్పాటు చేసిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, అదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆత్రం సుగుణకు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ చేయకుండా డిఎస్సీ నియామకాలు

### ప్రభుత్వ తీరుకు నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆందోళన

### ఇందిరాపార్క్ వద్ద మందకృష్ణను అడ్డుకున్న పోలీసులు



హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): డిఎస్సీలో ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఆందోళన చేపట్టింది. ఈ క్రమంలో నగరంలో ఆందోళనకు దిగిన ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాల పోస్టులను భర్తీ చేయడాన్ని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ నుంచి మాదిగల నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో ఈ నిరసనను పోలీసుల అడ్డుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో పాటు, పలువురు ఎమ్మార్పీఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ నేతలు, పోలీసులకు మధ్య వాగ్వివాదం తోపులాట ఉద్రిక్తతకు దారి తీసింది. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ నుంచి లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించ తలపెట్టిన మాదిగల నిరసన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. అరెస్ట్ చేసిన ఆందోళనకారులను నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి మాదిగలకు డీఎస్సీ ద్వారా వచ్చే ఉద్యోగాలను కల్పించిన తర్వాతే నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ముందుగానే నియామక పత్రాలు అందజేయడం వల్ల మాదిగలు అన్యాయానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా చేపట్టే ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించాలంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలను, కార్యకర్తలు ఉద్యమ కారులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయలేదా అని ప్రశ్నించారు. అలాగే ర్యాలీలు నిర్వహిస్తున్న వారిని అడ్డుకొని అరెస్ట్ చేయడం దారుణమంటూ మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయకుండానే ఉద్యోగాల భర్తీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నమ్మక ద్రోహం చేసిందని.. మాదిగలను నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాదిగల పట్ల ఎనలేని ప్రేమ ఉన్నట్లు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆచరించడం లేదని.. మాలల పక్షాన నిలుస్తున్నారన్నారు.

## మహిళలకు సిఎం రేవంత్ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు తెలంగాణ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.. తీరొక్క పూలతో రూపొందించే ఘనమైన బతుకమ్మలతో ఆడిపాడే సంబురాల్లో అఖరి రోజైన సద్దుల బతుకమ్మను పురస్కరించుకుని తెలంగాణలోని అక్కాచెల్లెళ్లందరకీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సద్దుల బతుకమ్మ సందర్భంగా ట్యాంక్ బండ్ తో పాటు రాష్ట్రంలోని చెరువులన్నింటీ వద్ద ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు..

## 30 మేకలను దొంగిలించిన దొంగలు

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు

జనగామ (క్రైమ్ మిర్రర్): తెలంగాణలో దసరా పండగ అంటేనే మందు, మాంసంతో ఎంజాయ్ చేస్తారు. అందరి ఇళ్లలో పండగ రోజు మటన్, మద్యం లేకుండా ఉండదు. పండగ కోసం అప్పు చేసి మరీ.. కొనుకుంటారు. ఇదిలా ఉంటే.. మార్కెట్‌లో ఈ సమయంలో మేకలకు, గొర్రెలకు డిమాండ్ ఎక్కువ. ఒక్కో మేక, గొర్రె మామలు సమయం కన్నా.. వెయ్యి రెండు వేలు ఎక్కువనే పలుకుతుంది. ఎంత డిమాండ్ ఉన్నా.. కొనకుండా మాత్రం ఉండరు. అమ్మకందారులైతే.. పండగ సీజన్ అదునుగా చూసి ఎక్కువ ధరకు అమ్ముతుంటారు. ఏదో విధంగా అయితే.. దసరా పండగ రోజు మాత్రం ఇంట్లో మటన్ కర్రీ ఉండాల్సిందే..జనగామ జిల్లాలో దొంగలు హల్చల్ చేశారు. జిల్లా కేంద్రంలోని బీరప్ప గడ్డలో కెమిడి లక్ష్మయ్యకు చెందిన 30 మేకలను గుట్టుచప్పుడు కాకుండా కొట్టం నుండి అర్థరాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. పండగ సమయంలో జిల్లాలో మేకల దొంగతనం కలకలం రేపుతున్నాయి.

## ఆర్థిక వనరులు లేకున్నా రుణమాఫీ

### రాజకీయాల్లో భాష సక్రమంగా ఉండాలి

### మూసీ మురికి నుంచి ప్రజలను కాపాడాల్సిందే

### మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ ఆసక్తిక వ్యాఖ్యలు

హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్): ఆర్థిక వనరులు ఉన్నా లేకపోయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాగా పని చేస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రుణమాఫీ చేశారని.. రైతు భరోసా కూడా ఇస్తామని ప్రభుత్వం చెప్తోందని.. తొందరగా ఇస్తే మంచిదని అభిప్రాయపడ్డారు. రాజకీయ నాయకులు పరుష పదజాలం వాడడం బాధాకరమన్నారు. కొందరు ఇష్టమున్నట్టు మాట్లాడితే తనలాంటి వాడికి ఇబ్బందిగా ఉందన్నారు. సోషల్ మీడియాలో వాడే పదజాలం పద్ధతిగా ఉండాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మాట్లాడకపోవడం ఆయన ఆటిట్యూడ్ అని.. మాట్లాడడం మాట్లాడకపోవడం కేసీఆర్ ఇష్టమని చెప్పుకొచ్చారు. హైడ్రా విషయంలో ప్లస్సా , మైనస్సా అని లెక్కలు వేయొద్దన్నారు. చంద్రబాబు రోడ్లు విస్తరణ వేసేప్పుడు తిట్టారని... రోడ్డు అయ్యాక మెచ్చుకున్నారని గుర్తుచేశారు. మురికిలో బతుకుతున్న వాళ్ళకి మంచి నివాసాలు ఇవ్వడం మంచిదే కదా అని అన్నారు. చెరువుల దగ్గరికి వెళ్లి ఎన్ని ఇండ్లు అక్రమంగా కట్టారో చూడాలన్నారు. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్ పడిపోయిందనడం సరైంది కాదని.. పది నెలల నుంచే ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఉందని చెప్పుకొచ్చారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వానికి ప్రతిపక్షం బాధ్యతగా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కొన్ని విమర్శలు చూస్తే వ్యక్తిగత కక్షతో చేసినట్టు కనిపిస్తోందన్నారు. 88 మంది వచ్చిన వాళ్ళు కూడా పూర్తి కేబినెట్ ఎందుకు వేయలేదని కేసీఆర్‌ను అడగాలన్నారు. సంవత్సరాలు నడిచిన కమిషన్లు, ఎంక్వయిరీ కమిటీలు ఉన్నాయని... మూడు నెలలకే కమిటీ ఏమైంది అనడం హాస్యాస్పదమంటూ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు ఇంత కాస్ట్లీ కావడానికి అన్ని పార్టీలు కారణమన్నారు. ‘నువ్వు సుద్ద పూసవైతే ఎదుటివాడ్ని విమర్శించు. టీఆర్ఎస్ పార్టీకి ఖాతా తెరవడానికి డబ్బులు లేకుండే. ఇప్పుడు 1500 కోట్లు ఉన్నాయని వారే ప్రకటించారు. రాజకీయ నాయకుల లూప్ హోల్స్ అధికారులకు తెలుసు. అధికారులు పర్మినెంట్, నేతలు టెంపరరీ‘ అంటూ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ కామెంట్స్ చేశారు. మరోవైపు శాసనమండలి చీఫ్ విప్‌గా పట్నం మహేందర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా చీఫ్ విప్‌పై మండలి చైర్మన్ పలు వ్యాఖ్యలు చేశారు. మహేందర్ రెడ్డిని బీఆర్ఎస్ విప్‌గా చూడాలా? కాంగ్రెస్ విప్ గా చూడాలా అని మీడియా ప్రశ్నించగా... మహేందర్ రెడ్డిని అఫిషియల్ విప్‌గా చూడాలని మండలి చైర్మన్ తెలిపారు. నేను బీఆర్ఎస్ మండలి చైర్మన్‌ను కాదు.. మండలి చైర్మన్ పదవి తీసుకున్నాక నాకు ఏ పార్టీ ఉండదని గుత్త సుఖేందర్ రెడ్డి వెల్లడించారు.

## ఎడిటోరియల్



# కాంగ్రెస్‌కు కలసి రాని ఒంటరి పోరు

### కూటమి పోటీతోనే మంచి ఫలితాలు

### విధానాలు మార్చుకుంటేనే కాంగ్రెస్‌కు భవిష్యత్

**హిం**దీ హార్ట్‌ల్యాండ్‌గా పేరుగాంచిన ఉత్తరాది రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నేటికీ పట్టు సాధించలేకపోతోంది. గత పదేళ్లలో చత్తీస్‌గఢ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో అధికారం అందినా ఐదేళ్ల తర్వాత రెండోసారి గెలుపొందలేక పోయింది. ఇందుకు కారణాలను ఆ పార్టీ విశ్లేషించుకోవడం లేదు. కేవలం ఇవిఎంలపైననో లేదా మోడీపై ననో విమర్శలు చేస్తూ తప్పించుకోవడం కుదరదు. ఓటమికి కారణాలను కనుగొనాలి. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలి. అదేపనిగా మోడీని తిడుతూ కూర్చుంటే గెలవలేమని గుర్తించాలి. రాజకీయాల తీరు తెన్నులు మారేలా నడుచుకోవాలి. అప్పుడే కాంగ్రెస్‌ను ప్రజలు నమ్ముతారు. ఉత్తరాది రాష్ట్రాల్లో పట్టు సాధిస్తే తప్ప జాతీయ రాజకీయాల్లో విజయాలు సాధించలేమని ఆ పార్టీ వ్యూహకర్తలకు తెలుసు. ఇదే సమయంలో భారతీయ జనతా పార్టీ మాత్రం నానాటికీ బలపడుతూ హిందీ రాష్ట్రాల్లో గట్టి పట్టు సాధిస్తూ ముందుకు కదులుతోంది. గత మూడున్నర దశాబ్దాల్లో బీజేపీ 2 పర్యాయాలు సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ మార్కు దాటింది. ఈసారి కాస్త 30కి పైగా పార్టీలతో ఏర్పడ్డ ఇండి-కూటమిని ఎదుర్కోవడంలో కాస్త తడబడాల్సి వచ్చింది. త ఏడాది 34 పార్టీలతో ఏర్పాటైన ఇండి-కూటమి అనేక రాష్ట్రాల్లో కలిసి పోటీ చేసినప్పటికీ.. 15 రాష్ట్రాలు,

కేంద్ర పాలిత ప్రాంతాల్లో కాంగ్రెస్ ఒంటరిగానే బీజేపీని ఢీకొట్టింది. వాటిలో దక్షిణాదిన కర్ణాటకలో మాత్రమే నేరుగా బీజేపీతో తలపడగా, మిగతా రాష్ట్రాల్లో స్థానిక ప్రాంతీయ పార్టీలు, కూటములతో తలపడింది. కర్ణాటకలో బీజేపీ మీద, తెలంగాణలో బీఆర్ఎస్ మీద మెరుగైన ఫలితాలు సాధించింది. కేరళలో కాంగ్రెస్ సారథ్యంలోని కూటమి 20కి 18 చోట్ల గెలుపొందింది. తమిళనాడులో మిత్రపక్షం ద్రవిడ మున్నేట్ర కళగంతో కలిసి గణనీయమైన సంఖ్యలో సీట్లు సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేక పోయింది. ఇక, ఉత్తరాది రాష్ట్రాల్లో ... బిహార్, జార్ఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, జమ్ము-కాశ్మీర్‌లో స్థానికంగా బలంగా ఉన్న మిత్రపక్ష ప్రాంతీయ పార్టీలపైనే ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది. బెంగాల్‌లో కమ్యూనిస్టులతో కలిసి పోటీ చేసినా ఆ రాష్ట్రంలో ప్రధాన పోరు తృణమూల్ కాంగ్రెస్ , బీజేపీ మధ్యనే సాగింది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో జట్టుకట్టినా, ఆ స్నేహం పంజాబ్‌లో అమలు కాలేదు. అయితే కొన్ని చోట్ల ఈ కూటములు, పొత్తులు ఫలించి కాంగ్రెస్ సీట్ల సంఖ్య పెరగడానికి దోహదపడ్డాయి. మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్ బాల్ ఠాక్రే వర్గం), నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్ వర్గం)తో కలిసి కొన్ని సీట్లు, యూపీలో సమాజ్‌వాదీ పార్టీ తో కలిసి కొన్ని కాంగ్రెస్ ఖాతాలో అదనంగా చేరాయి. హర్యానా ఎన్నికల ఫలితాల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఒక పరాన్నజీవిగా మారిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన 99 సీట్లలో సగం వరకు మిత్రపక్షాల బలంతోనే వచ్చాయని సూత్రీకరించారు. అయితే మిత్రపక్షాలు కాంగ్రెస్‌పై ఆధారపడిన రాష్ట్రాల్లో వారి ఎన్నికల నౌకలు మునిగిపోయాయాని తెలిపారు. కాంగ్రెస్ ఎంత పరాన్నజీవి అంటే అది తన సొంత మిత్రులను మింగేస్తుందని మోదీ విరుచుకుపడ్డారు. తన గెలుపు కోసమే పొత్తు.. తాను ఒంటరిగా గెలిచేలా ఉంటే ఎవరూ వద్దు అన్నది కాంగ్రెస్ విధానంగా కనిపిస్తోంది. అదే ఇప్పుడు ఆ పార్టీని వరుస ఓటములతో ముంచేస్తోంది. ఈ తరహా రాజకీయాలు కాకుండా కలిసి పోరాడే విధంగా పార్టీని బలోపేతం చేసుకోవాలి. కులరాజకీయాలు, కుటుంబ రాజకీయాలను పక్కన పెట్టాలి. సమిష్టి రాజకీయాలకు పెద్దపీట వేయాలి. ఆ దిశగా కాంగ్రెస్ అడుగులు వేయగలిగితేనే మంచి ఫలితాలు వస్తాయి.

# ఓడిపోతే ఇవిఎంలది తప్పా?



**హ**ర్యానా, జమ్ముకాశ్మీర్ ఎన్నికల ఫలితాలు వచ్చాయి. హర్యానాలో బిజెపి హ్యాట్రిక్ విజయం సాధించగా కాశ్మీర్‌లో ఇండియా కూటమి గెలిచింది. ఎన్‌సితో పొత్తు ద్వారా కాశ్మీర్‌లో కాంగ్రెస్ కొన్ని సీట్లు సాధించుకోగలిగింది. ఇక హర్యానాలో గెలుస్తారని సర్వేలు చెప్పినా..అనూహ్యంగా బిజెపి పుంజుకుని విజయం సాధించింది.ఇంతవరకు బాగానే ఉన్నా..మరోమారు కాంగ్రెస్ తన అనుమానాలను బయటపెట్టింది. ఇవిఎంల ట్యాంపరింగ్ అంటూ పాత పాట పాడింది. కాశ్మీర్‌లో కూడా ట్యాంపరింగ్ జరిగివుంటే బిజెపి గెలిచేది. హర్యానాలో ట్యాంపర్ చేసిన బిజెపి,కాశ్మీర్‌ను మాత్రం వదులుకుంటుందా అన్నదే ప్రశ్న. కాంగ్రెస్ ఆరోపణలు చేస్తే రెండు రాష్ట్రాలపై చేయాలి. వారు గెలిచిన కర్నాటక, తెలంగానల పైనా చేయాలి. కానీ గెలిచిన చోట వదిలి ఓడిన చోట ట్యాంపరింగ్ అంటే ప్రజలు నమ్మడానికి సిద్దంగా లేరు. పదేళ్ల యూపిఎ పాలన అంతా ట్యాంపరింగ్ గెలుపుతో నడిచిందా అన్నది కూడా కాంగ్రెస్ చెప్పాలి. ట్యాంపరింగ్ అనుమానాలపై ఇప్పటికే నివృత్తి జరిగింది. ఇసి పలు సందర్భాల్లో వాటిని ఎలా వినియోగిస్తున్నదీ వివరించింది. టెక్నికల్ టీమ్ వాటిని సరిచూసింది. ఈ క్రమంలో ఇవిఎంలపై అనుమానాలను మాత్రం బిజెపి కొట్టి పారేస్తోంది. సాంకేతికత అభివృద్ధి చెందిన తరుణంలో దీనిపై అనుమానాలు అక్కర్లేదు. ఇవిఎంల ట్యాంపరింగ్ పై అనుమానాలు వ్యక్తం చేస్తూ..తమను ప్రజలు తిరస్కరించారన్న నిజాన్ని కాంగ్రెస్ అంగీకరించడం లేదని అందరూ గుర్తుంచుకోవాలి. గతంలో అనేకమార్లు అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ ఈ విషయంలో ఆనాడు అనుమానాలు వ్యక్తం చేయలేదు. తాజాగా ఇప్పుడు మారోమారు ఇవిఎంలపై అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఇవిఎంలతోనే గతంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ నిస్సిగ్గుగా మాట్లాడడం దారుణం కాక మరోటి కాదు. ఇకపోతే కాంగ్రెస్ ఒంటరిగా పోటీచేస్తున్నప్పుడల్లా ఓటమి చెందుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఇండియాకూటమితో పోవడంతోనే ఈ మాత్రం సీట్లు సాధించగలిగింది.హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి శరాఘాతంగా మారడంతో నెపాన్ని ఇవిఎంలపైకి నెట్టేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఓ 30 పార్టీలతో జతకట్టి 'ఇండియన్ నేషనల్ డెవలప్ మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్ ఇండియా పేరుతో కూటమిని కట్టి భారతీయ జనతా పార్టీని కొంత మేర నిలువరించగలిగింది. అంతే తప్ప బీజేపీ సారథ్యంలోని 'నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఎన్‌డిఎ విజయాన్ని మాత్రం అడ్డుకోలేకపోయింది. గత పదేళ్లలో వివిధ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలను చూస్తే బీజేపీతో ముఖాముఖి తలపడ్డ అనేక సందర్భాల్లో ఓటమి పాలవుతూ వస్తోందని అర్థమవుతోంది.తాజాగా జరిగిన రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగా బీజేపీని ఢీకొట్టలేక హర్యానాలో చతికిలపడగా.. జమ్ము-కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ తో జతకట్టి గెలుపును సొంతం చేసుకుంది. ఇంకా లోతుగా వెళ్తే.. ఇక్కడ బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడ్డ చోట్ల కమలదళానిదే పైచేయి. కాంగ్రెస్ పోటీ చేసిన 39 సీట్లలో కేవలం 6 సీట్లు మాత్రమే గెలుచుకోగలిగింది. కాంగ్రెస్ గెలిచిన సీట్లలో ఒక్కటి కూడా హిందూ జనాభా ఎక్కువగా ఉన్న సీటు లేదు. గెలిచిన అభ్యర్థుల్లో ఒక్కరు కూడా హిందువు లేరు. దీన్ని బట్టి ఆ కొన్ని సీట్లు కూడా నేషనల్ కాన్ఫరెన్స్ పుణ్యమే అని స్పష్టమవుతోంది. హర్యానాలో జాట్-దళిత-మైనారిటీ కాంబినేషన్‌తో ఒంటరిగా గెలుపొందాలని చేసిన ప్రయత్నం చాలావరకు కలిసొచ్చినా.. జాటేతర వర్గాలు బీజేపీ వైపు ఏకీకృతం కావడంతో అనుకున్నది సాధించలేకపోయింది. కనీసం ఆమ్ ఆద్మీ పార్టీ, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, బహుజన్ సమాజ్ పార్టీలలో ఏ ఒక్క పార్టీతో పొత్తు పెట్టుకున్నా పరిస్థితి మరోలా ఉండేదని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ఎందుకంటే బీజేపీ,

కాంగ్రెస్ సాధించిన ఓట్ల శాతంలో వ్యత్యాసం 1 శాతం కంటే తక్కువే. బీజేపీ 39.94 శాతం ఓట్లతో 48 సీట్లు గెలుపొందగా, కాంగ్రెస్ 39.09శాతం ఓట్లు సాధించినప్పటికీ 37 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. అనేక నియోజకవర్గాల్లో గెలుపోటముల మధ్య తేడా వందల్లోనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఏ ఇతర పార్టీతో జతకట్టినా కాంగ్రెస్ అధికారం సాధించగలిగేదని స్పష్టమవుతోంది. జాతీయస్థాయిలో బీజేపీని ఓడించడమే ఏకైక లక్ష్యంగా 30 పార్టీలను ఏకతాటిపైకి తెచ్చిన కాంగ్రెస్, అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో కొన్నిచోట్ల మాత్రం తాను మాత్రమే గెలవాలి.. మరొకరికి భాగం ఉండరాదు అన్నట్టుగా వ్యవహరించింది. తనకు తగిన బలం లేదు అనుకున్న రాష్ట్రాల్లో మాత్రమే స్థానికంగా బలంగా ఉన్న ప్రాంతీయపార్టీలతో జట్టుకట్టి పోటీ చేస్తోంది. 2022లో మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బీజేపీతో కాంగ్రెస్ నేరుగా తలపడి ఓటమిపాలైంది. ఉత్తరాదిన హిమాచల్‌లో మాత్రమే గెలుపొందగలిగింది. తెలంగాణలో విజయం సాధించినప్పటికీ.. అక్కడ పోటీపడింది కేవలం బీజేపీతో మాత్రమే కాదు. అప్పటి వరకు తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితితో తలపడి ముక్కోణపు పోటీలో 39 శాతం ఓట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. ఈ లెక్కన చూస్తే బీజేపీతో నేరుగా తలపడడంలో కాంగ్రెస్ తడబడుతోందని స్పష్టమవుతోంది. ఓ ఇద్దరు ముగ్గురిని వెంటేసుకుని వెళ్తేనో.. లేకపోతే ముక్కోణపు పోటీ లేదా బహుముఖ పోటీ ఉన్నప్పుడో కాంగ్రెస్ విజయాలు సాధించగల్గుతోంది. ఈ విజయాలను విశ్లేషించుకుని కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగాలి. ఇవిఎంలపై నెపాన్ని నెట్టేసి, అది మోడీ కుట్ర అంటూ సాగితే ప్రజలు స్వాగతించరని గుర్తించాలి. హర్యానాలో ఓటమి గుణపాఠం కావాలి. మరింత పట్టుదలగా పనిచేయాలి. అధికారం ఉన్న రాష్ట్రాల్లో ఆదర్శ పాలన అందించాలి. ఢిల్లీ ప్రదక్షిణలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి. చీటికిమాటికీ మంత్రులు, ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిపించుకునే సంస్కృతి పోవాలి. కాంగ్రెస్ తన లోపాలను సరిదిద్దుకుని ముందుకు సాగితేనే ప్రజలు ఆదరిస్తారు.

# సరస్వతీ అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ

### అమ్మవారి దర్శనం కోసం భారీగా భక్తులు రాక

### కూతురు ఆద్యతో అమ్మవారిని దర్శించుకున్న పవన్

### అమ్మవారి సేవలో మంత్రి అనిత తదితరులు



**ఇం**ద్రకీలాద్రి పై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రుల్లో భాగంగా ఏడవరోజు బుధవారం అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి జన్మ నక్షత్రం మూలా నక్షత్రం కావడంతో ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. దీంతో అధికారులు అన్ని టిక్కెట్లు రద్దు చేసి, అన్ని క్యూలైన్లలో ఉచితంగా భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. అర్ధరాత్రి నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అలాగే దేశ వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూలా నక్షత్రం కావడంతో దుర్గమ్మ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ క్రమంలో దుర్గమ్మను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దర్శించుకున్నారు. కుమార్తె ఆద్యతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్న పవన్‌కు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు, అమ్మవారి చిత్ర పటం అందజేశారు. పవన్‌తోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత, ఎంపీ కేశినేని శివనాథ్, మంత్రి నిమ్మల రామానాయుడు దుర్గమ్మను దర్శించుకున్నారు. ఇక ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తాన్నారు. దీంతో ఆ ప్రాంతమంతా జనసంద్రంగా మారింది.అలాగే అమ్మవారిని దర్శించుకునేందుకు హోం మంత్రి వంగలపూడి అనిత వచ్చారు. కాగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను చూడగానే భక్తులలో ఒక్కసారిగా ఉత్సాహం వచ్చింది. జై జనసేన జై పవన్ కళ్యాణ్ అంటూ నినాదాలు చేశారు. వినాయకుని గుడి వద్ద క్యూలైన్లు దాటి భక్తులు బారులు తీరారు. బాక్సుల విధానంలో రోప్‌ల సాయంతో యాభై మంది చొప్పున భక్తులను క్యూలైన్‌లోకి పోలీసులు పంపుతున్నారు. తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని దృష్టి లో ఉంచుకుని సీపీ రాజశేఖర్ బాబు ముందస్తుగా అవసరమైన అన్నీ చర్యలు చేపట్టారు. కొండపైకి ఈరోజు ఎటువంటి వాహనాలను అనుమతించమని పోలీసులు వెల్లడించారు. కాగా బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి

చంద్రబాబు దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. చంద్రబాబు ఆయన సతీమణి భువనేశ్వరి మూడు గంటలకు ఇంద్రకీలాద్రికి చేరుకోనున్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాక సందర్భంగా నగరంలో కొన్ని ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నామని సీపీ తెలిపారు. డైనమిక్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్ ద్వారా ఎప్పటికప్పుడు సమయాను కూలంగా ఈ ఆంక్షలు ఉండే అవకాశం ఉందన్నారు. కనకదుర్గా ఫ్లై ఓల్గ÷వర్ మీద ఎటువంటి ఆంక్షలు లేవని, కాళేశ్వరరావు మార్కెట్ వద్ద ÷÷-ల ఓవర్‌పై రాకపోకలు పూర్తిగా నిషేధించామన్నారు. ఇప్పటికే విధులలో 4,500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తుండగా, అదనంగా మరో 1100 మంది పోలీసులను 110 బృందాలుగా ఏర్పాటు చేసి హోల్డింగ్ టీమ్‌లుగా విధులు కేటాయించినట్టు తెలిపారు. కాగా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఆరో రోజు మంగళవారం కనకదుర్గమ్మ అదృష్టం, విలాసం, ఐశ్వర్యం, సంపద, శ్రేయస్సులకు ప్రదాత అయిన లక్ష్మీదేవిగా దర్శనమివ్వగా అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి వరకూ క్యూలైన్లలో రద్దీ కొనసాగింది. ఒంటినిండా బంగారం, పుష్పాలంకరణలో ఐశ్వర్య ప్రదాయిని రూపాన్ని తిలకించి తరించారు. సాయంత్రం అమ్మవారి నగరోత్సవం కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇంద్రకీలాద్రికి భక్తుల రద్దీ పెరిగింది. వివిధ రాష్ట్రాలనుంచి తరలివచ్చిన భక్తులతో తెల్లవారుజాము నుంచి అన్ని క్యూలు నిండిపోయాయి. కనకదుర్గమ్మ మంగళవారం శ్రీమహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, శివస్వామి దర్శించుకున్నారు. అన్నవరం దేవస్థానం అధికారులు, అర్చకులు అమ్మవారికి పట్టువస్త్రాలను, పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకాతిరుమల నుంచి పట్టుచీర సమర్పించారు. ఇంద్రకీలాద్రిపై మంగళవారం సాధారణంగానే కనిపించింది. మామూలు రోజుల్లో ఆదివారం, మంగళవారం, శుక్రవారం భక్తులు అధికంగా వస్తుంటారు. ఈ రోజుల్లో 50 వేల నుంచి 60 వేల వరకు భక్తుల సంఖ్య ఉంటుంది. ఆ స్థాయిలోనే భక్తులు వచ్చారని ఆలయ అధికారులు అంచనా వేశారు. విజయవాడకు చెందిన ఓ మహిళ రూ.500 క్యూలో వచ్చి రాజగోపురం వద్ద సొమ్మసిల్లి పడిపోయింది. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వారి సందడి ఎక్కువగా కనిపించింది. మధ్యాహ్నం నుంచి కాణిపాకం దేవస్థానం అధికారులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనధికార దర్శనాలు పెరిగిపోవడంతో పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నారు. వీఐపీలకు కేటాయించిన 9-11, 2-4 స్లాట్‌ల్లో కాకుండా ఇతర సమయాల్లో వస్తే వారిని వీఐపీ మార్గంలో దర్శనాలకు అనుమతించడంలేదు. వారిని రూ.500 క్యూలో పంపుతున్నారు. అమ్మవారు బుధవారం మూల నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. లక్షలాది మంది భక్తులు ఈ దర్శనానికి వచ్చే అవకాశం ఉండడంతో మరింత కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# మణికొండ మున్సిపాలిటీ పరిధిలో దసరా పండగను పురస్కరించుకోని బతుకమ్మ సంబరాలు





**గండిపేట్(క్రైం మిర్రర్):** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో దసరా పండగను పురస్కరించుకోని బతుకమ్మ సంబరాలను అంబరంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి తీరోక్కపూలతో అలంకరించిన బతుకమ్మలను చూడముచ్చగా తీర్చిదిద్దారు. మహిళలంతా ఒక్క చోటకు చేరుకోని బతుకమ్మ పాటలకు అనుగుణంగా బతుకమ్మ నృత్యాలను చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బేబీ పాండ్‌లో బతుకమ్మలను నిమర్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ వందననాగేష్, మీనా ముత్యాలు, జ్యోతి, శ్వేత, బాల్‌రెడ్డి, లావణ్య, శైలజ, కోఆప్షన్ సభ్యురాలు లక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రాధాకుమారి, టీఎంసీ లక్ష్మి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### దుర్గామాత పూజలో పాల్గొన్న

## పర్వేధ కటికే అర్చన సతీష్ కుమార్ దంపతులు



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్పల్లి మండల పరిధి పర్వేధ గ్రామంలో ధర్మ సత్రంలో నిర్వహించినటువంటి దుర్గ మాత పూజా కార్యక్రమం చేయడం జరిగింది పూజ చేసిన దంపతులు కటికె సతీష్ కుమార్ అర్చన దంపతులు పూజ చేసి భక్తులకు లక్ష్మీ దేవత అవతారం అమ్మవారు దర్శనం ఇవ్వడం జరిగింది. తీర్థ ప్రసాదాలు ఇవ్వడం జరిగింది. మాలద్దారించిన దుర్గామాత దీక్ష భక్తులకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని భక్తులందరికీ దుర్గామాత ఆశీస్సులు ఉండాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి వెంకట్ రెడ్డి , వార్డు మెంబర్స్ , సుదర్శన్ రావు పంతులు, కృష్ణారెడ్డి ,జనం రెడ్డి, అనంత కిషన్ రావు పంతులు, అనంత్ రెడ్డి , గుడి పూజారి శ్రవణ్ పంతులు , కటికే సతీష్ కుమార్ అర్చన ఫ్యామిలీ పాల్గొన్నారు.

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మణికొండ మున్సిపల్ చైర్మెన్ కస్తూరి నరేందర్





గండిపేట్, (క్రైమ్ మిర్రర్) : అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మణికొండ మున్సిపల్ చైర్మెన్ కస్తూరి నరేందర్ అన్నారు. బుధవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ పోచమ్మ తల్లి దేవాలయం శ్రీ తవిసా ఇన్‌ఫ్రా గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ మాట్లాడుతూ.. అమ్మవారి కరుణ కటాక్షాలతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలన్నారు. అమ్మవారిని ప్రతిష్టించుకొని నవరాత్రులు అమ్మవారికి పూజలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్, కస్తూరి యాదయ్య, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ పండగ సందర్బంగా సూరన్ చెరువు ని పరిశీలించిన రవి నాయక్

### తుక్కుగూడ మున్సిపల్ కమిషనర్ తో చరవాణిలో మాట్లాడిన కౌన్సిలర్ రవి నాయక్




**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో గురువారం జరగబోయే బంగారు బతకమ్మ పండుగ ముగింపు పూజ కార్యక్రమానికి ముస్తాబవుతున్న సురాన్ చెరువు ప్రాంగనాన్ని,అక్కడ జరుగుతున్న పనుల ను పరిశీలించిన స్థానిక కౌన్సిలర్ రవి నాయక్ అలాగే అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి వర్క్ ఇన్స్పెక్టర్ తో అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ వెంకట్రామ్ ని చరవాణిలో మాట్లాడుతూ బంగారూ బతకమ్మ పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి సమస్య రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని కమిషనర్ కు తెలియజేశారు. తుక్కుగూడ మున్సిపల్ మహిళా తల్లులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు కౌన్సిలర్ రవి నాయక్.

# తిరుమల యూత్ ధ్వర్యంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు

### సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గంలొ అంగరంగ వైభవంగా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో శ్రీ దుర్గాదేవి ప్రతిమను నెలకొల్పి భక్తి శ్రద్దలతో అమ్మవారిని వివిధరూపలుగా కోలుచుకున్నారు విజయదశమి సందర్బంగా అమ్మవారికి నవరాత్రుల ఉత్సవాన్ని నివహిస్తారు ప్రతి గ్రామంలో ప్రజలందరూ సుఖషాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండేలా అమ్మవారు దీవించాలని వేదంపండితులచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు అనంతరం అన్నదానం వితరణతో ముగింపు చేస్తున్న నిర్వాహకులు.






## ఉపాధ్యాయ నియామకాలతో ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ట పరచడమే ప్రభుత్వ లక్ష్యం

### మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి

**క్రైమ్ మిర్రర్,మిర్యాలగూడ:** మిర్యాలగూడ డివిజన్ పరిధిలో డిఎస్సి -2024 ద్వారా నియామకం కాబడిన 144 మంది నూతన ఉపాధ్యాయులకు లాల్ బహుదూర్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామకపత్రాల ప్రధాన కార్యక్రమానికి వెళుతున్న మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బీఎల్ఆర్ ప్రారంభించారు. బుధవారం స్థానిక ఎన్ఎస్పి క్యాంపు రాజీవ్ స్టేడియం నుండి బయలుదేరిన బస్సులకు జెండా ఊపిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజాపాలనలో నిరుద్యోగుల జీవితాలలో వెలుగులు నింపే విధంగా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికతో ముందుకు పోతుందని అన్నారు. నియామకం కాబడిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో నేను నా మిర్యాలగూడ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విద్యారంగానికి ప్రథమ ప్రాధాన్యత అందిస్తున్నామని, వృత్తి నిబద్ధతతో విధులు నిర్వర్తించి నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎండీ. యూసుఫ్,మిర్యాలగూడ, దామరచర్ల,మండల విద్యాధికారులు బాలు, బాలాజీనాయక్,వెంకన్న,ఆర్ రవి ,కాంగ్రెస్ నాయకులు,బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

# మణికొండలో ఘనంగా ప్రపంచ తపాల దినోత్సవం..






**గండిపేట్(క్రైం మిర్రర్):** ప్రపంచ తపాల దినోత్సవాన్ని పురస్కరించుకోని మణికొండ మున్సిపాలిటీలోని తపాల కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి హజరైయ్యారు. ఈ సందర్భంగా మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం భారీ ర్యాలీని చేపట్టారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఏక్ పేడ్ మాకే నామ్ ప్రజలు తపాల సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ సీనియర్ సూపర్డెంట్ సి.హెచ్.రామకృష్ణ, హైదరాబాద్ తపాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపర్డెంట్ శిల్ప, శ్రీనివాస్‌నాయక్, డివిజన్ పిఆర్ఐ డబ్బులు సబ్ పోస్ట్ మాస్టర్, చిత్రపురి కాలనీ, కొత్తగూడెం, బంజారాహిల్స్‌కు చెందిన తపాల కార్యాలయం పోస్ట్ మెన్స్, సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే ,సుమలత రెడ్డి,వన్షిక రెడ్డి




**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్ పల్లి 13వ వార్డులో బతుకమ్మ వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పువ్వులతో పేర్చిన బతుకమ్మలను తీసుకుని వచ్చి ఆటపాటలతో మహిళలంతా ఒక్కచోట చేరి బతుకమ్మ ఆడారు. కాలనీల వారిగా ఎక్కడికక్కడ మహిళలు కలిసి బతుకమ్మ ఆడారు. చిన్న,పెద్ద, అనే భేదం లేకుండా అందరూ బతుకమ్మ ఆటపాటలను తిలకించారు.

# విషవాయువు వస్తుంటే వార్త రాయొద్ద..


# ఎలా రాస్తవంటూ బెదిరింపులు

## ప్రజలకు ఇబ్బందులు కలుగుతుందంటే ప్రశ్నించొద్దాం..

## వార్తలు రాసినందుకు ఏం చేసుకుంటావో చేసుకో అంటూ బయో ఆఫీసర్స్..





**సంస్థాన్ నారాయణపూర్, అక్టోబర్ 09(క్రైమ్ మిర్రర్):** గత కొద్దీ రోజులుగా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల కేంద్రంలో బయో డీజిల్ కంపెనీ నుండి విషవాయువు వస్తున్న తరుణంలో క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ వార్తలు రాస్తున్నాడని తెలుసుకొని బుధవారం రోజున కంపెనీ నుండి జియం ఆఫీసర్లు కలిసి మాట్లాడాలని చెప్పి కలవడం జరిగింది. రిపోర్టర్ గా వారితో మాట్లాడుతూ వాసనను బంద్ చేయండి సర్ మాకు కంప్లీట్ ఇచ్చారు,ఇలా అయితే ఏలా సర్ అంటూ మాటకు మాటలో దురసు సమాధానాన్ని ఇచ్చి మీకు కంప్లైంట్ ఎవరు చేశారు, వాసన మీకే వస్తుందా, మాకు రావట్లేదు ఏంటి అంటూ వెటకారమైన మాటలు మాట్లాడుతూ పెన్ను ఉందని ఏది పడితే అది రాసుకుంటా ఉంటే బాగుండదు,అంటూ రిపోర్టర్ కి సమాధానం ఇస్తూ.. మేము చేసేది చేస్తాం నువ్వేం చేసావో చేసుకో అంటూ.. సూటిబూటి సమాధానం ఇస్తూ బెదిరింపులకు దారి దారి తీసినట్టుగా ఉండి పోయింది, బయో డీజిల్ పై వార్త రాస్తుంటే ఇలాంటి కంపెనీ ఒకటే ఉందా మీకు వార్తలే లేవా అన్నట్టు, రిపోర్టర్ తో సరైన పద్ధతితో మాట్లాడకపోవడం విడ్డురాకరం... పై అధికారులకు ఉన్నంత పద్ధతి కింది ఆఫీసర్లకు లేకపోవడమే కంపెనీకి ఇలాంటి వారి వల్ల కంపెనీకి యాజమాన్యానికి ప్రజల ప్రాణాలకు ఇబ్బందులు ఎదురవ్వడం కష్టంమని అంటున్నారు.

# కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం

### దానినే విస్మరించిన గత ప్రభుత్వం

### డిఎస్సీని అడ్డుకునేందుకు అనేక యత్నాలు

### ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో భట్టి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం జరిగిందని.. అయినా, గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ఎలాంటి చర్య తీసుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. దశాబ్ద కాలం డీఎస్సీ గురించి ఆలోచన చేయలేదని ఆక్షేపించారు. పేదలకు నాణ్యమైన విద్య అందించా లనే తపనతోనే టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. ప్రతిపక్షం డీఎస్సీపై ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా, ఆటంకాలు సృష్టించినా అనుకున్న సమయానికి డీఎస్సీ పక్రియను పూర్తి చేశామన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో టీచర్లకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. ఏళ్ల తరబడి పదోన్నతులు, బదిలీల్లేక టీచర్లు ఇబ్బందులు పడ్డారు. మా ప్రభుత్వం రాగానే టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తి చేసింది. డీఎస్సీపై ప్రతిపక్షం చాలా కుటిల ప్రయత్నాలు చేసింది. అయినా.. డీఎస్సీ పక్రియ ఆగలేదని అన్నారు.మరోవైపు, రాష్ట్రంలో 10వేల మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ ఏడాది పిబ్రవరిలో 11,062 పోస్టుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కేవలం ఏడు నెలల్లోనే మెగా డీఎస్సీ పక్రియను రేవంత్ సర్కార్ పూర్తి చేసింది. డీఎస్సీ పరీక్షలకు 2.46లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. బ్యాక్‌లాగ్ పోస్టులు మిగిలిపోకుండా మొత్తం పక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. మొత్తం 2,515 స్కూల్ అసిస్టెంట్లు, 685 భాషా పండితులు, 6277 ఎస్‌జీటీ, 145 పీఈటీ, 103 స్పెషల్ ఎడ్యుకేటర్ల పోస్టులు, 281 ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను భర్తీ చేశారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి 761మంది, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లా నుంచి 82మందినియామక పత్రాలు అందుకోనున్నారు. కోర్టు కేసులు, ఇతర సమస్యలతో 1056 పోస్టుల భర్తీ పక్రియ పెండింగ్‌లో ఉందని వివరించారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తున్నామని అన్నారు.

# లంచాలకు మరిగిన భార్య

### వీడియోల ద్వారా బయటపెట్టిన భర్త

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** భార్య అక్రమ సంపాదనపై ఓ భర్త నిజాలు వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా భార్య నిజస్వరూపం బయటపెట్టారు. లంచం లేనిదే ఇంటికి రాదంటూ..ఇంట్లో దాచిన నోట్ల కట్టలను బయటపెట్టారు. అక్రమ సంపాదన అయినా, కష్టపడి సంపాదన అయినా.. భార్య డబ్బులు తీసుకొస్తుందంటే సరేలే డబ్బులైతే సంపాదిస్తుందని కామ్‌గా ఊరుకుంటారు. కానీ.. ఇతను చేసిన పనికి మాత్రం ఆశ్చర్యపోనవసరం లేదు. ఈ రోజుల్లో కూడా ఇలాంటి భర్తలు ఉన్నారు అంటే.. గ్రేట్ అని చెప్పాలి. వివరాల్లోకి వెళ్తే.. రంగారెడ్డి జిల్లా మణికొండ మున్సిపల్ డీఈఈ దివ్య జ్యోతిపై అవినీతి ఆరోపణలను తన భర్తే బయటపెట్టాడు. ప్రతిరోజు లంచం తీసుకురానిది ఇంటికి రాదని భర్త సంచలన ఆరోపణలు చేశాడు. తాను తీసుకొచ్చిన లంచానికి ఇవే సాక్షాలు అంటూ ఇంట్లో డబ్బులు దాచిన ప్రతి చోటు చూపిస్తూ భర్త కొన్ని వీడియోలు విడుదల చేశాడు. ఇంట్లో ప్రతి చోట కట్టల కట్టల డబ్బులు చూపిస్తూ రూ. 20 లక్షలు నూ. 30 లక్షలు తీసుకొస్తుంది అంటూ ఆరోపణలు చేశాడు భర్త.. నిత్యం లక్షల్లో లంచం తీసుకుంటుందని, ఏడేళ్ల నుంచి లంచం తీసుకోవద్దని వద్దని వారించినా భారీ మొత్తంలో డబ్బులు తీసుకోవడం తనని మనోవేదనకు గురి చేస్తుందంటూ విడుదల చేసిన వీడియోల్లో పేర్కొన్నాడు. పెద్ద ఎత్తున మణికొండలో కాంట్రాక్టర్ల నుంచి కమిషన్‌ను తీసుకుంటూ లంచాలు భారీగా ఇంటికి తీసుకువస్తుంది అని చెప్పాడు. లంచం మంచిది కాదని.. ఎన్నిసార్లు ప్రవర్తన మార్చుకోమని చెప్పిన మార్చుకోక పోవటంతో భర్త వీడియోలు మీడియాకు పంపించాడు. పెద్ద ఎత్తున ఆరోపణలు రావటంతో రెండ్రోజుల క్రితం జ్యోతి జీహెచ్‌ఎంసీకి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంది.

# దసరా బస్సుల్లో ప్రత్యేక చార్జీలు

### వెల్లడించిన ఆర్టీసీ ఎండి సజ్జన్నార్

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** పండుగ వేళ ప్రయాణికులకు టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం షాకింగ్ న్యూస్ చెప్పింది. దసరా వేళ స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లు పెట్టేందుకు సిద్ధమైంది. దసరా రద్దీ దృష్ట్యా స్పెషల్ బస్సులు నడుపుతున్నామని ప్రకటించిన ఆర్టీసీ.. ఆ బస్సుల్లో ప్రత్యేక ఛార్జీలు ఉంటాయని స్పష్టం చేసింది. దసరా రద్దీ నేపథ్యంలో ప్రత్యేకంగా 6,300 బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ ఎంపీ సజ్జనార్ ప్రకటించారు. అలాగే మహాలక్ష్మి స్కీమ్ కింద మరో 600 బస్సులను అదనంగా నడిపిస్తున్నామన్నారు. అయితే స్పెషల్ బస్సుల్లో అదనపు ఛార్జీలు ఉంటాయని సజ్జనార్ స్పష్టం చేశారు. రిటర్న్ జర్నీలో ఖాళీగా బస్సులు రావాల్సి ఉంటుందని.. అందుకే కొంత ఛార్జీలు పెంచడం జరిగిందని సజ్జనార్ వివరించారు.ఇప్పటికే కొన్ని బస్సులు నడుస్తున్నాయని.. గురువారం నుంచి మొత్తం బస్సులను నడిపిస్తామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు ఈ స్పెషల్ బస్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అయితే, మహాలక్ష్మి పథకంలో భాగంగా ఫ్రీ జర్నీ చేసే మహిళలు తప్పకుండా తమ ఆధార్ కార్డు చూపించాలని స్పష్టం చేశారు. కార్డు చూపించకుండా ఆర్టీసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు. దసరా సందర్భంగా నగరంలోని ప్రజలు తమ తమ సొంతూళ్లకు పయనం అవుతున్నారు. ఇప్పటికే స్కూళ్లు, కాలేజీలకు హాలిడేస్ ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం. దీంతో హైదరాబాద్‌లో హాస్టళ్లలో ఉండి చదువుకునే కాలేజీ విద్యార్థులంతా ఊరు బాట పట్టారు. పెద్దలు సైతం తమ తమ సొంతూళ్లకు పయనమవుతుండటంతో ఆర్టీసీ బస్టాండ్‌లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడు తున్నాయి.

# ఎన్నికల హామీలను ఎగ్గొట్టిన కాంగ్రెస్

### హామీలకు పైసలు లేకున్నా మూసీ ముచ్చటేందో

### రేవంత్ సర్కార్‌పై కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు పైసలు లేవంట.. కానీ మూసీ ప్రక్షాళన కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తాడంట.. అని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ సీనియర్ లీడర్ మహమ్మద్ అలావుద్దీన్ పటేల్ సహా ఆయన అనుచరులు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ జాబ్ పొగొట్టండి. మీకు ఏడాది లో 2 లక్షల ఉద్యోగాలంటూ రాహుల్ గాంధీ అశోక్ నగర్‌కు వచ్చి ఇది నా గ్యారంటీ అని హామీ ఇచ్చాడు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డికి తప్ప తెలంగాణ యువతకు ఉద్యోగాలు రాలేదని కేటీఆర్ తెలిపారు. మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నాడు. కోటి 60 లక్షల మంది మహిళలు రూ. 2500ల కోసం వేచి చూస్తున్నారు. వృద్ధులకు రూ. 4 వేలు అన్నాడు. ఇంట్లో ఇద్దరికీ పింఛన్ అన్నాడు. ఒక్కరికన్నా వచ్చిందా? అంటే లేనే లేదు. ఉన్న రైతు బంధు, ఉన్న పింఛన్ కూడా వస్తలేదు. వాళ్లు 420 హామీలు ఇచ్చారు. ఇప్పుడు ఏమైనయ్ అంటే సమాధానం చెబుతలేదు. కళ్యాణ లక్ష్మి పేరుతో తులం బంగారం ఇస్తా అన్నాడు. తులం ఇనుము కూడా ఇవ్వడని కేటీఆర్ విమర్శించారు. సంక్షేమ పథకాల కోసం పైసలు ఇస్తే మీరు కమిషన్‌లు ఇవ్వరు కదా? అదే మూసీ ప్రాజెక్ట్ అయితే లక్షా కోట్లు మింగొచ్చు. రాహుల్ గాంధీ, వాళ్ల బావకు కోట్ల రూపాయలు దోచి పెట్టొచ్చు. మనం గల్లా పట్టి అడిగే వరకు ఈ కాంగ్రెస్ పార్టీ మోసం కొనసాగుతూనే ఉంటది. మనం ఏదైనా సమస్య వస్తే కలెక్టర్లకు చెప్పాలంట. ఇంటింటికి ఓట్ల కోసం వచ్చిన వాళ్లను మాత్రం అడగవద్దంట. ప్రజలకు ఏం ఖర్మ. ఎవరైతే మనకు తప్పుడు హామీలు ఇచ్చారో వాళ్లనే పట్టుకోవాలే. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులను పట్టుకొని మనం అడగాలె అని కేటీఆర్ సూచించారు.

# నేడు నగరంలో సద్దుల బతుకమ్మ వేడుకలు

### భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

### ట్రాఫిక్ ఆంక్షలు విధించిన నగర పోలీసులు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** నగరంలో సద్దుల బతుకమ్మ వేడుకలను వైభవంగా నిర్వహించాని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఏర్పాట్లు చేసింది. గురువారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించనున్నారు. బాణాసంచా కాల్పులు, లేజర్ షోలు ప్రత్యేక ఆకర్శణగా నిలవనున్నాయి. ఈ సందర్భంగా గురువారం నాడు నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో అమరవీరుల స్మారకస్థూపం నుంచి అప్పర్ ట్యాంక్ బండ్‌లోని బతుకమ్మ ఘాట్ వరకూ ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ఓ ప్రకటనలో వెల్లడించారు. గురువారం రోజు సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 11గంటల వరకూ ఆంక్షలు అమలులో ఉంటాయని చెప్పారు. ఈ ప్రాంతాల గుండా వెళ్లే ప్రయాణికులు ఇతర మార్గాలను చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆంక్షలు ఉన్న ప్రాంతాలు, దారి మళ్లింపు గురించి వెల్లడించారు. ఇక్బాల్ మినార్ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చే వాహనాలను తెలుగు తల్లి ÷÷–లఓల్గ÷వర్ వైపు మళ్లించనున్నారు. రాణిగంజ్ నుంచి ఖుఔఖీ మార్గ్(నె÷–లకెస్ రోడ్) వైపు వచ్చే వాహనదారులను నల్లగుట్ట క్రాస్ రోడ్ వద్ద మినిస్టర్ రోడ్ వైపునకు మళ్లిస్తారు. మినిస్టర్ రోడ్ నుంచి నె÷–లకెస్ రోడ్ వైపు వచ్చే వారిని నల్లగుట్ట క్రాస్ రోడ్ వద్ద రాణిగంజ్ వైపు మళ్లిస్తారు. లిబర్టీ నుంచి ఎగువ ట్యాంక్ బండ్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను పాత అంబేడ్కర్ విగ్రహం వద్ద ఇక్బాల్ మినార్ వైపు మళ్లిస్తారు. సికింద్రాబాద్ నుంచి అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను కర్బలా మైదాన్ వద్ద బైబిల్ హౌస్ వైపునకు మళ్లిస్తారు. ధోబీ ఘాట్ నుంచి చిల్డ్రన్స్ పార్క్/అప్పర్ ట్యాంక్ బండ్ వైపు వచ్చే వారిని డీబీఆర్ మిల్స్ వద్ద కవాడిగూడ క్రాస్ రోడ్ వైపునకు పంపిస్తారు. డీబీఆర్ మిల్స్ నుంచి వచ్చే ప్రయాణికులను కవాడిగూడ క్రాస్ రోడ్ వద్ద జబ్బార్ కాంప్లెక్స్, సీజీవో టవర్స్ వైపు మళ్లించనున్నారు. సెయిలింగ్ క్లబ్ వైపు వెళ్లాలనుకునే సీజీవో టవర్స్ నుంచి వచ్చే వాహనదారులను కవాడిగూడ క్రాస్ రోడ్ వద్ద డీబీఆర్ మిల్స్, జబ్బార్ కాంప్లెక్స్ వైపు మళ్లిస్తారు.సికింద్రాబాద్ నుంచి ట్యాంక్ బండ్ మీదుగా వెళ్లే అన్ని అంతర్ జిల్లా ఆర్టీసీ బస్సులు స్వీకర్ - ఉపకార్ జంక్షన్ వద్ద సంగీత్- మెట్టుగూడ -తార్నాక - నల్లకుంట- ఫీవర్ హాస్పిటల్ క్రాస్ రోడ్- బర్కత్‌పురా - టూరిస్ట్ హోటల్ - నింబోలి అడ్డా - చాదర్‌ఘాట్ వద్ద మళ్లించబడతాయి. ట్యాంక్ బండ్ వైపు వచ్చే సిటీ బస్సులను కర్బలా మైదాన్ వద్ద బైబిల్ హౌస్ వైపునకు మళ్లించనున్నారు. ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉన్నందున ప్రయాణికులు పాత అంబేద్కర్ విగ్రహం, కవాడిగూడ క్రాస్‌రోడ్స్, కట్ట మైసమ్మ, కర్బలా మైదాన్, రాణిగంజ్, నల్లగుట్ట, ఖైరతాబాద్ జంక్షన్ల వైపు వెళ్లొద్దని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

# హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

## 19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

## జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.

**బయ్యర్లలో తగ్గిన ఆసక్తి**


గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**హైడ్రా ఎఫెక్ట్**

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచననే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనేవారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

**దేశవ్యాప్తంగా..**

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.



# హమ్మయ్య..కోలుకున్నాయి

## సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం

## 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు ఆర్బీఐ తన పరపతి సమీక్షలో తీసుకునే నిర్ణయం కోసం మదుపరులు వేచి చూస్తుండటం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను తరలించుకుపోయినప్పటికీ సూచీలు లాభాల్లో ముగిశాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

# ఓలా ఎలక్ట్రిక్‌కు మరో షాక్

## సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ .. అథారిటీ నుంచి షోకాజ్ నోటీసు



న్యూఢిల్లీ: విద్యుత్ స్కూటర్ల సంస్థ ఓలా ఎలక్ట్రిక్‌కు వరుసగా షాకులు తగులుతున్నాయి. తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అనుచిత వ్యాపార విధానాలతో నిబంధనలను ఉల్లంఘిస్తోందన్న ఆరోపణలతో సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) తాజాగా షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని సూచించినట్లు ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలిపింది. %అయితే, తమ ఆర్థిక, నిర్వహణ కార్యకలాపాలపై దీని ప్రభావం ఉండదని పేర్కొంది. అలాగే, సీసీపీఏ ఎలాంటి జరిమానాలు విధించలేదని తెలిపింది. ఈ వార్తలతో ఓలా షేరు మంగళవారం మరో 6% పడింది. చివర్లో కోలుకుని 5 శాతం లాభంతో రూ. 95 వద్ద క్లోజైంది. వాహనాల సర్వీస్ నాణ్యతపై సోషల్ మీడియాలో స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రాతో ఓలా వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ మధ్య వాగ్వాదం ప్రభావంతో సోమవారం కంపెనీ షేరు 8 శాతం పైగా పతనమైంది.

# నష్టాలకు ముగింపు! లాభాల్లోకి మార్కెట్లు



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం లాభాల్లో ముగిశాయి. 5-రోజుల నష్టాల నుంచి బయటపడి విజయాల బాట పట్టాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 584.81 పాయింట్లు లేదా 0.72 శాతం లాభపడి 81,634.8 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 కూడా 217.38 పాయింట్లు లేదా 0.88 శాతం పెరిగి 25,013.15 వద్ద ముగిసింది. సెన్సెక్స్ వ్యక్తిగత స్టాక్‌లలో అదానీ పోర్ట్స్, ఎం%డ%ఎం, రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్%డ%టీ, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, కోటక్ బ్యాంక్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. 1 శాతం నుండి 4.5 శాతం మధ్య లాభపడ్డాయి. మరోవైపు టాటా స్టీల్, టైటాన్ కంపెనీ, బజాజ్ ఫిన్‌సర్వ్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, ఐటీసీ షేర్లు 2.7 శాతం వరకు క్షీణించి సెన్సెక్స్ టాప్ లూజర్‌గా ఉన్నాయి. విస్తృత మార్కెట్లలో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.86 శాతం, బీఎస్ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 2.44 శాతం పెరిగింది. విస్తృత సూచీలు నేడు బెంచ్‌మార్క్ సూచీలను అధిగమించాయి. ఇదిలా ఉండగా సెక్టార్లలో నిఫ్టీ మెటల్ ఇండెక్స్ మినహా అన్ని సూచీలు ఈరోజు ట్రేడింగ్‌లో ర్యాలీ చేశాయి. నిఫ్టీ మీడియా ఇండెక్స్ 3 శాతం, నిఫ్టీ ఆటో 1.84 శాతం, నిఫ్టీ ఫార్మా 1.5 శాతం చొప్పున ఎగబాకాయి.

# సామ్‌సంగ్ టాప్




న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశా రు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి. ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్‌వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.




# ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.




# రూట్ రికార్డు సెంచరీ

ముల్తాన్: పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లండ్ భారీ స్కోరు దిశగా దూసుకెళుతున్నది. పాకిస్థాన్ బౌలింగ్ దాడిని దీటుగా ఎదుర్కొంటూ ఇంగ్లండ్ బ్యాటర్లు ఇరుగదీస్తున్నారు. ఓవర్‌నైట్ స్కోరు 96/1తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన ఇంగ్లండ్.. జోరూట్(277 బంతుల్లో 176 నాటౌట్, 12ఫోర్లు), హ్యారీ బ్రూక్(173 బంతుల్లో 141 నాటౌట్, 12ఫోర్లు, సిక్స్) సెంచరీల విజృంభణతో ఇంగ్లండ్ ఆట ముగిసే సరికి 3 వికెట్లు కోల్పోయి 492 పరుగులు చేసింది. ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ తన కెరీర్‌లో మరో మైలురాయిని చేరుకున్నాడు. టెస్టుల్లో 35వ సెంచరీతో మరింత ముందంజ వేశాడు.టెస్టుల్లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన కుక్‌ను దాటేశాడు. బౌలర్లకు ఏమాత్రం సహకరించని పిచ్‌పై రూట్, బ్రూక్ నాలుగో వికెట్‌కు 243 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.




# గెలిచి నిలిచారు..

## హర్మన్‌ప్రీత్, మందన అర్ధసెంచరీలు

## శ్రీలంకపై భారత్ ఘన విజయం

## సెమీస్ రేసులోకి టీమ్ఇండియా

**ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు సమిష్టి ప్రదర్శనతో కదం తొక్కింది. కీలకమైన సెమీస్ రేసులో నిలువాలంటే భారీ విజయం తప్పనిసరి అయిన పరిస్థితుల్లో టీమ్ఇండియా జూలు విదిల్చింది. నాయక ద్వయం హర్మన్‌ప్రీత్‌కౌర్, మందన అర్ధసెంచరీలతో భారీ స్కోరు అందుకున్న భారత్..శ్రీలంకను స్వల్ప స్కోరుకు కట్టడి చేసింది. తద్వారా సెమీస్ రేసులో రెండో స్థానానికి దూసుకొచ్చింది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఓటములతో లంకకు నిరాశే ఎదురైంది.**

దుబాయ్: టీ20 ప్రపంచకప్‌లో టైటిల్ ఫేవరేట్లలో ఒకటైన భారత్ అద్భుత ప్రదర్శన కనబరిచింది. మెగాటోర్నీలో నిలువాలంటే భారీ తేడాతో గెలువాల్సిన స్థితిలో అదరగొట్టింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో టీమ్ఇండియా 82 పరుగుల తేడాతో లంకపై ఘన విజయం సాధించింది. దీంతో 0.576 రన్‌రేట్‌తో గ్రూపు-ఏలో ఆస్ట్రేలియా(2.52) తర్వాత స్థానంలో కొనసాగుతున్నది. తొలుత కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(27 బంతుల్లో 52 నాటౌట్, 8ఫోర్లు, సిక్స్), స్మృతి మందన(38 బంతుల్లో 50, 4ఫోర్లు, సిక్స్) అర్ధసెంచరీలతో భారత్ 20 ఓవర్లలో 172/3 స్కోరు చేసింది. ఆటపట్టు, కాంచన ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన లంక..19.5 ఓవర్లలో 90 పరుగులకు ఆలౌటైంది. కవిశ(21), అనుష్క(20)టాప్ స్కోరర్లుగా నిలిచారు. అరుంధతిరెడ్డి(3/19), ఆశా శోభన(3/19) మూడేసి వికెట్లు తీశారు. ధనాధన్ అర్ధసెంచరీతో జట్టు విజయంలో కీలకమైన హర్మన్‌ప్రీత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. మందన, కౌర్ దూకుడు: కచ్చితంగా భారీ విజయం సాధించాల్సిన పరిస్థితుల్లో మందన, హర్మన్‌ప్రీత్ అద్భుత ఆటతీరు ప్రదర్శించారు. ఓపెనర్లు షెఫాలీవర్మ, మందన దూకుడైన బ్యాటింగ్‌తో జట్టుకు మెరుగైన శుభారంభం అందించారు. దీంతో వవర్‌ప్లే ముగిసే సరికి భారత్ వికెట్ కోల్పోకుండా 41 పరుగులు చేసింది. మధ్యలో కొంత ఆట నెమ్మదించినా..వీరిద్దరు వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు. అయితే వరుస బంతుల్లో వీరు ఔట్ కావడం ఒకింత ఆందోళన కల్గించినా..కౌర్ వచ్చి రావడంతోనే బ్యాటు ఝులిపించింది. లక్ష్యఛేదనలో లంక ఏమాత్రం పోరాటపటిమ కనబర్చలేకపోయింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన ధాటికి లంక వరుసగా వికెట్లు కోల్పోయింది.

# నితీశ్ సూపర్ షో

## ఆల్‌రౌండ్ ప్రదర్శనతో విజృంభణ

## బంగ్లాపై భారత్ భారీ విజయం

## సిరీస్‌లో 2-0తో ముందంజ




న్యూఢిల్లీ: టీమ్ఇండియా యువ క్రికెటర్లు దుమ్మురేపుతున్నారు. బుధవారం జరిగిన రెండో టీ20లో టీమ్ఇండియా 86 పరుగుల తేడాతో బంగ్లాను చిత్తుగా ఓడించింది. భారత్ నిర్దేశించిన 222 పరుగుల భారీ లక్ష్యఛేదనలో 9 వికెట్లు కోల్పోయి 135 పరుగులకు పరిమితమైంది. మహ్మదుల్లా(41) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. వరుణ్‌చక్రవర్తి(2/19), నితీశ్‌కుమార్(2/23) రెండేసి వికెట్లు తీశారు. అంతకుముందు నితీశ్(34 బంతుల్లో 74, 4ఫోర్లు, 7సిక్స్‌లు), రింకూసింగ్(29 బంతుల్లో 53, 5ఫోర్లు, 3 సిక్స్‌లు) సూపర్ అర్ధసెంచరీలతో టీమ్ఇండియా 20 ఓవర్లలో 221/9 స్కోరు చేసింది. రిషాద్‌హుస్సేన్(3/55) మూడు వికెట్లు పడగొట్టాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన నితీశ్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య ఈనెల 12న హైదరాబాద్ మూడో టీ20 మ్యాచ్ జరుగుతుంది.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్:** 20 ఓవర్లలో 221/9(నితీశ్ 74, రింకూ 53, రిషాద్ 3/55, తస్కిన్ 2/16),
**బంగ్లాదేశ్:** 20 ఓవర్లలో 135/9(మహ్మదుల్లా 41, పర్వేజ్ 16, వరుణ్ 2/19, నితీశ్ 2/23)

**నితీశ్, రింకూ అదుర్స్** : తొలుత టాస్ గెలిచిన బంగ్లా..భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. మెహదీహసన్ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్ వరుస బంతుల్లో శాంసన్(10) రెండు ఫోర్లు కొట్టి దూకుడుగా ప్రారంభించాడు. అయితే ఆ మరుసటి ఓవర్ ఆఖరి బంతికి షాట్ ఆడబోయిన శాంసన్..శాంతోకు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. తంజిమ్ మూడో ఓవర్‌లో వరుస ఫోర్లతో జోరు మీద కనిపించిన అభిషేక్‌శర్మ(15)..చివరి బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా..నితీశ్‌కుమార్ సంయమనం పాటించాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన ముస్తాఫిజుర్..కెప్టెన్ సూర్యకుమార్(8)ను స్లో బాల్‌తో బోల్తా కొట్టించాడు. దీంతో పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 3 కీలక వికెట్లు కోల్పోయి 45 పరుగులు చేసింది. ఈ సమయంలో నితీశ్, రింకూసింగ్..ఇన్నింగ్స్ బాధ్యతను భుజానెత్తుకున్నారు. కెరీర్‌లో రెండో మ్యాచ్ ఆడుతున్న నితీశ్ మంచి పరిణతి కనబరిచాడు. రిషాద్ వేసిన 10వ ఓవర్‌లో నితీశ్ కండ్లు చెదిరే సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. తానేం తక్కువ కాదన్నట్లు మరో ఎండ్‌లో రింకూ కూడా చెలరేగడంతో 10 ఓవర్లకు భారత్ 101/3 స్కోరుకు చేరుకుంది. బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా చెలరేగిన నితీశ్ 27 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన మెహదీని నితీశ్ గట్టిగా అరుసుకున్నాడు. మూడు భారీ సిక్స్‌లకు తోడు ఓ ఫోర్‌తో 26 పరుగులు పిండుకున్నాడు. ముస్తాఫిజుర్ వేసిన మరుసటి ఓవర్‌లో 73 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద నితీశ్ వెనుదిరిగాడు. దీంతో నాలుగో వికెట్‌కు 108 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఓవైపు నితీశ్ ఔటైనా..హార్దిక్‌తో కలిసి రింకూ తన జోరు కొనసాగించాడు. ఈ క్రమంలో ఓ భారీ సిక్స్‌తో అర్ధసెంచరీ ఖాతాలో వేసుకున్న రింకూ తస్కిన్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత రియాన్ పరాగ్(15), హార్దిక్(32), వరుణ్(0), అర్ష్‌దీప్‌సింగ్(0) వెంటవెంటనే ఔటయ్యారు.

**బంగ్లా ఢమాల్:** భారీ లక్ష్యఛేదనలో బంగ్లా ఆది నుంచే తడబాటుకు గురైంది. అర్ష్‌దీప్ మూడో ఓవర్‌లో పర్వేజ్ హుసేన్(16) తొలి వికెట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత కెప్టెన్ శాంతో(11)..సుందర్‌కు వికెట్ ఇచ్చుకోగా, లిటన్ దాస్(14)ను వరుణ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. దీంతో పవర్‌ప్లే పూర్తయ్యే సరికి బంగ్లా 43/3 స్కోరు చేసింది. ఇలా వరుస విరామాల్లో బంగ్లా వికెట్లు కోల్పోతూ వచ్చింది. మిడిలార్డర్‌లో మహ్మదుల్లా ఒంటరిపోరాటం చేసినా లాభం లేకపోయింది.

# భారత్ కొత్త చరిత్ర

## మహిళల జట్టుకు కాంస్యం



అస్తానా: ఏషియన్ టీటీ చాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు కొత్త చరిత్ర లిఖించింది. టోర్నీ చరిత్రలో తొలిసారి కాంస్య పతకాన్ని ఖాతాలో వేసుకుంది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో జపాన్ చేతిలో 1-3 తేడాతో ఓటమితో భారత్‌కు కాంస్య దక్కింది. మరోవైపు పురుషుల క్వార్టర్స్‌లో భారత్ 3-1తో కజకిస్థాన్‌పై గెలిచి వరుసగా మూడోసారి కాంస్య ఖాయం చేసుకుంది. గురువారం జరిగే సెమీస్‌లో చైనీస్ తైపీ లేదా జపాన్‌తో భారత్ తలపడుతుంది. మహిళల పోరు విషయానికొస్తే నాలుగో సీడ్ జపాన్ జట్టుకు భారత్ దీటైన పోటీనివ్వలేకపోయింది. దీనికి తోడు విదేశీ కోచ్ మాసిమో కొస్టాటినీ లేకపోవడం, టాప్ ర్యాంకర్ ఆకుల శ్రీజను బెంచ్‌పై ఉంచడం భారత్ గెలుపు అవకాశాలను దెబ్బతీసింది.

GHMC
hmda
Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com


SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

## వరదసాయంపై ముఖాముఖి చర్చకు రండి

### నిజాలేంటో మీకు స్వయంగా వివరిస్తా

### ఇష్టం వచ్చినట్లుగా ఆరోపణలు మానండి

### వైసిపికి హోంమంత్రి అనిత ఘాటు హెచ్చరిక



**విజయవాడ, (క్రైమ్ మిర్రర్):** వరద సహాయానికి సంబంధించి సాక్షి పత్రికలో వచ్చిన వార్తలపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరద సహాయంపై సాక్షి పత్రికలో ఇష్టం వచ్చినట్లు వార్తలు రాస్తున్నారని మండిపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. వరద సాయంపై చర్చకు రావాలంటూ వైసీపీకి హోంమంత్రి సవాల్ విసిరారు. సొంత పత్రికల్లో కాదు ఫేస్ టు ఫేస్ కూర్చుందామని ఛాలెంజ్ చేశారు. వరద సాయంపై చర్చించడానికి మేం సిద్ధం.. వైసీపీ నుంచి చర్చకు ఎవరైనా వస్తారా..? ఎన్టీఆర్ జిల్లాలో రూ. 92 కోట్లు మాత్రమే ఆహారం కోసం ఖర్చు చేశాం. వరద సాయం కింద ఎన్టీఆర్ జిల్లాకు విడుదల చేసిందే రూ. 139 కోట్లు. అంతకు మించి అవినీతి జరిగిందని ఎలా చెబుతారు.. అంటూ ప్రశ్నించారు. వరద సాయం అందించడమే కాకుండా.. బుడమేరు గండ్లను పూడ్చేలా మంత్రులకు బాధ్యతలు అప్పజెప్పారన్నారు. వరద సమయంలో దాదాపు పదిరోజుల పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలెక్టరేట్‌లో మకాం వేసి రాష్ట్రంలో ఉన్న వరద ప్రాంతాల్లో పరిస్థితి సమీక్షించారని.. అంతేకాకుండా వార్డులకు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించారని తెలిపారు. ప్రతి చిన్న అంశాన్ని పట్టించుకున్న చంద్రబాబు లాంటి నాయకుడు ఎవరైనా ఉంటారా అని అడిగారు. ఖజానా ఖాళీ చేసేసి.. అవినీతి ఖజానా అంటారా అంటూ మండిపడ్డారు. ఖజానాలో సొమ్ముని తన జమానాలోనే జగన్ జమ చేసేసుకున్నారు అంటూ విరుచుకుపడ్డారు.

## హర్యానాలో గెలుపును చేజేతులా జారవిడుచుకున్నారు

### అంతర్గ విభేదాలే కాంగ్రెస్ ఓటమికి కారణం

### ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శలు

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీపై గెలుపును చేజేతులారా జారవిడుచుకున్నారంటూ కాంగ్రెస్ పార్టీపై ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ బుధవారంనాడు విమర్శలు గుప్పించారు. తమ ఓటమికి ఈవీఎంలను కాంగ్రెస్ తప్పుపట్టడంపై ఆక్షేపణ తెలిపారు. ఈవీఎంలను తప్పుపట్టడం చాలా సులభమని, ఈవీఎంల వల్ల మీరు (కాంగ్రెస్) నెగ్గినప్పుడు మాట్లాడరని, ఓడిపోతే మాత్రం ఈవీఎంలను తప్పు పడుతుంటారని అన్నారు. ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయేందుకు అనేక ప్రతికూల అంశాలు ఉన్నాయి. హర్యానాలో ప్రభుత్వ వ్యతిరేకత ఉంది. కాంగ్రెస్ పార్టీ అంతర్గత విభేదాల వల్లే బీజేపీ గెలిచింది. పరిస్థితిని బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుందని ఒవైసీ విశ్లేషించారు. పదేళ్ల బీజేపీ పాలనలో ప్రభుత్వ వ్యతిరేకతను కాంగ్రెస్ పార్టీ సమర్ధవంతంగా ఉపయోగించుకుని ఉండాల్సిందని, కానీ ఆ పార్టీ అంతర్గత వ్యవహారాలు బీజేపీకి లబ్ధి చేకూర్చాయని అన్నారు. బీజేపీకి ఏ చిన్న అవకాశం ఇచ్చినా ఎన్నికల్లో దానిని తమకు అనూకులంగా మార్చుకుంటుందని చెప్పారు. బీజేపీ విజయానికి విద్వేష ప్రచారమే కారణమని అనడం సరికాదని 2024 పార్లమెంటు ఎన్నికల తర్వాత కూడా తాను చెప్పానని, సమయం వచ్చినప్పుడు కూడా తాను తరచు ఈ విషయం చెబుతూనే ఉంటానని అన్నారు. 'మరి బీజేపీ విజయానికి కారణం ఎవరు? మీరే (కాంగ్రెస్) ప్రధాన విపక్షంగా ఉన్నారు. బీజేపీని ఓడించే సువర్ణావకాశం మీకు ఉంది. కానీ ఆ అవకాశం ఉపయోగించుకోవడంలో మీరు విఫలం అయ్యారని కాంగ్రెస్ పార్టీని ఒవైసీ తప్పుపట్టారు. హర్యానా ఫలితాలను తాము అంగీకరించడం లేదని, అనేక చోట్ల పోలింగ్ ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, ఈవీఎం తప్పిదాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ నేతలు పలువురు ఆరోపించారు. హిసార్, మహేంద్రగఢ్, పానిపట్‌లలో 99 శాతం బ్యాటరీ ఉన్న మిషీన్లతో బీజేపీ గెలిచిందని, కాంగ్రెస్ 60-70 బ్యాటరీ లెవల్స్ ఉన్న ఈవీఎంలతో గెలిచిందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సైతం వివిధ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, వాటిని భారత ఎన్నికల కమిషన్ దృష్టికి తెస్తామని చెప్పారు. కాగా, ఫలితాలను అప్‌డేట్ చేయడంలో జాప్యం జరిగిందని కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ ఇప్పటికే ఆరోపణలను చేయగా, వాటిని ఈసీఐ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. బాధ్యతారాహిత్యమైన వ్యాఖ్యలని కొట్టిపారేసింది.

## ఒడిదుడుకుల్లో అంతర్జాతీయ మార్కెట్లు


### స్వల్పంగా తగ్గిన బంగారం రేట్లు

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** అంతర్జాతీయ ప్రభావంతో బులియన్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం పడుతోంది. దీని ప్రభావంతో మొన్నటి వరకు భారీ స్థాయిలో ఒడిదుడుకులకు గురైన ప్రపంచవ్యాప్తంగా ఎఫెక్ట్ పడుతోంది. మార్కెట్‌లు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న మార్కెట్ ఇప్పుడు కాస్త స్థిమితపడింది. ప్రస్తుతం ఔన్స్ బంగారం ధర 2,654 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మన దేశంలో ఈ రోజు 10 గ్రాముల స్వచ్ఛమైన పసిడి (24 క్యారెట్లు) ధర 760 రూపాయలు, ఆర్నమెంట్ గోల్డ్ (22 క్యారెట్లు) ధర 700 రూపాయలు, 18 క్యారెట్లు రెట్ల బంగారం రేటు 570 రూపాయల చొప్పున తగ్గింది. వెండి రేటు 2000రూపాయలు తగ్గింది. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 76,690 వద్దకు; 22 క్యారెట్ల బంగారం ధర 70,300 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర 57,520 వద్దకు చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్‌లో 1,00,000 గా ఉంది. ఏపీ, తెలంగాణవ్యాప్తంగా ఇదే ధర అమల్లో ఉంది.విజయవాడలో10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 76,690 వద్దకు; 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర ? 70,300 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర 57,520 వద్దకు చేరింది. ఇక్కడ కిలో వెండి ధర 1,00,000 గా ఉంది. విశాఖపట్నం మార్కెట్‌లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది.

# మా తొలి ప్రాధాన్యం కాశ్మీర్‌కు రాష్ట్ర హోదానే

### అధికారం చేపట్టగానే దీనిపైనే తీర్మానిస్తాం

### కాబోయే సిఎం ఒమర్ అబ్దుల్లా ప్రకటన



**శ్రీనగర్, (క్రైమ్ మిర్రర్):** జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ గెలుపు అనంతరం సీఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు చేపడతారని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర హోదా ఇవ్వాలనే తీర్మానాన్ని ప్రధానికి సమర్పిస్తామన్నారు. నియోజకవర్గాల పునర్విభజన, ఎన్నికలు, రాష్ట్ర హోదా వరుసగా ఉంటాయన్నారు. కొందరు నేతలు జమ్మూకశ్మీర్‌ను దిల్లీతో పోల్చడంపై ఆయన మండిపడ్డారు. కశ్మీర్‌ను దిల్లీతో పోల్చవద్దని..ఎందుకంటే దేశ రాజధానికి రాష్ట్ర హోదా ఇస్తామని ఎవరూ చెప్పలేదన్నారు. కానీ కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని ప్రధాని, హోంమంత్రి, భాజపా సీనియర్ మంత్రులు చెప్పారని పేర్కొన్నారు. 2019 వరకు జమ్మూకశ్మీర్ రాష్ట్రంగానే ఉందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కశ్మీర్‌లో శాంతిని నెలకొల్పడం, అభివృద్ధికి బాటలు వేయడం కోసం రాష్ట్ర హోదా తప్పనిసరి అని పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఉన్న రాజకీయ పార్టీలను భాజపా లక్ష్యంగా చేసుకొని.. బలహీనపరచడానికి ప్రయత్నించిందని దుయ్యబట్టారు. కానీ ఆ పార్టీ ఎత్తులు ఫలించలేదన్నారు. ముఖ్యమంత్రిగా తన పేరును తన తండ్రి ప్రకటించడంపై ఒమర్ అబ్దుల్లా స్పందిస్తూ.. నేషనల్ కాన్ఫరెన్స్ శాసనసభా పక్ష సమావేశం అనంతరం మిత్రపక్షాలతో చర్చలు జరిపి ఈవిషయంపై నిర్ణయం తీసుకుంటామన్నారు. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో 2019లో ప్రత్యేక ప్రతిపత్తి హోదాను కోల్పోయింది. దీంతోపాటు ఆ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారిపోయింది. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా కల్పించాలన్నది ఫరూక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ డిమాండ్ చేస్తోంది. ఒమర్ అబ్దుల్లా కూడా గత అయిదేళ్లుగా అందుకోసమే తీవ్రంగా శ్రమిస్తున్నారు. కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్నంతవరకూ జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో అడుగుపెట్టబోనని అన్న ఒమర్.. యూటర్న్ తీసుకొని, అసెంబ్లీ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే వరకు తన ప్రయత్నాన్ని విరమించుకోనని పట్టుదలతో ఉన్నారు.

# కాలుష్య నియంత్రణ మన తక్షణ కర్తవ్యం

### భూమిమీద కనీస బాధ్యత లేకుండా జీవనం తగదు

### భవిష్యత్ తరలా కోసం మనమంతా కష్టపడాలి

### డిప్యూడి సిఎం పవన్ కళ్యాణ్ పిలుపు



**విజయవాడ, (క్రైమ్ మిర్రర్):** రానున్న ఐదేళ్ల కాలంలో ఎంతవరకు కాలుష్యాన్ని నియంత్రించాలనే అంశంపై ఆలోచన చేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు. నేను పర్యావరణ ప్రేమికుడిని.. ప్రకృతి బాగుండాలని కోరుకునే వ్యక్తిని.. ప్రకృతి ప్రేమికులు ఎంత తపన పడతారో నాకు తెలుసు. భూమి మీద కనీస బాధ్యత లేకుండా మనం జీవనం సాగిస్తున్నాం. భూమిని మనం సొంతం చేసుకోవడం కాదు.. భూమే ఏదొకనాటికి మనలను సొంతం చేసుకుంటుందని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో విజయవాడలో వర్కుషాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు నిపుణులు, మేధావులు, ఎన్జీవోల సూచనలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ వర్కుషాపు ద్వారా పరిశ్రమల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ రెండు అంశాలపై వేసే అడుగులపై అందరికీ స్పష్టత వస్తుందన్నారు. ఈ పీసీబీ ఛైర్మన్‌కు నా ఆలోచన చెప్పిన వెంటనే.. ఈ వర్కుషాపును ఏర్పాటు చేశారు. అన్ని రంగాల నిపుణులు, ఎన్జీవోలను ఆహ్వానించడం అభినందనీయం. 974 కిలోమీటర్ల కోస్టల్ కారిడార్ ఉంది.. దానిని అభివృద్ధి చేయాలి. పర్యావరణ సమతుల్యత దెబ్బ తినకుండా.. పరిశ్రమల ఏర్పాటు కావాలి. భవిష్యత్ తరాల కోసం.. మనమంతా ఇప్పటి నుంచే ఆలోచన చేయాలి. జల, వాయి కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ వర్కుషాపుకు వచ్చిన నిపుణులు సలహాలతో సమాజానికి మరింత మేలు జరగాలనేది నా ఆకాంక్ష. మీ అనుభవం, మీ మేధస్సు ఈ రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడాలి. విపరీతంగా కాలుష్యం పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. కాలుష్య కోరల నుంచి సమాజాన్ని రక్షించడంలో మీరంతా పాత్రధారులు కావాలి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అంటే.. పరిశ్రమల యాజమాన్యాలలో అపోహలు ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడతారనే అభద్రత పీసీబీపై ఉంది. దీంతో ఆ తర్వాత పాలకులు పరిశ్రమల ద్వారా వచ్చే కాలుష్యాన్ని పట్టించుకోవడం మానేశారు. ఇక నుంచి పరిశ్రమల ఏర్పాటు, కాలుష్యం నివారణ రెండు అంశాలపైన ప్రత్యేక దృష్టి పెట్టాం. మీ అమూల్యమైన సలహాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నా విజ్ఞప్తి అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో రిటైర్డ్ ఐఏఎస్ కృష్ణయ్య, ఐఏఎస్ జీ. అనంత రాము, వ్యర్థ పదార్థాల నిర్వహణలో పర్యావరణ సవాళ్లపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి. చంద్రుడు ఐఏఎస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. 'పరిశ్రమల అభివృద్ధితో పాటు, కాలుష్య నియంత్రణ కూడా అరికట్టేలా భాగస్వామ్యుల అభిప్రాయాలను తీసుకునేందుకు ఈ వర్కుషాపు. ప్రజల భాగస్వామ్యంతో సూచనలు, సలహాలతో ముందుకు సాగాలని భావిస్తున్నాం. అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. భవిష్యత్‌లో పరిశ్రమల ఏర్పాటు చేస్తూనే కాలుష్యాన్ని ఎలా నివారించాలనే దానిపైనా ఆలోచన చేస్తున్నాం. స్వచ్ఛంధ సంస్థలు కూడా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నాయి. వారి సలహాలు కూడా తీసుకుని, కాలుష్య నియంత్రణకు కృషి చేసేలా ముందుకు సాగుతాం. ఈ వర్కుషాపులో తమ విలువైన సూచనలు చేసేందుకు నిపుణులు కూడా అనేక మంది వచ్చారు. జల కాలుష్యం, వాయి కాలుష్యం నివారించేందుకు పర్యావరణ చట్టం తీసుకు వచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత పరిశ్రమలు ఎక్కువగా తెలంగాణాలోనే ఉండిపోయాయి. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే, ఆర్థిక ప్రగతి సాధించాలన్నా పరిశ్రమలు, అనుబంధ సంస్థలు అవసరం. కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకు అందరూ కృషి చేయాలి. పరిశ్రమల ఏర్పాటు ఎంత ముఖ్యమో, ప్రజల ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. అందరి అభిప్రాయాలు ఆలోచనలు పంచుకుని.. పరిశ్రమల ఏర్పాటుతో పాటు, కాలుష్య నివారణ లక్ష్యంగా పని చేయాలని కృష్ణయ్య వెల్లడించారు.

# హర్యానా ఫలితాలను విశ్లేషిస్తున్నాం

### జమ్మూకశ్మీర్ ప్రజలకు కృతజ్ఞతలు

### ఎక్స్‌లో పోస్ట్ చేసిన కాంగ్రెస్ నేత రాహుల్



**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ హరియాణా లో కాంగ్రెస్ ఓటమి పాలైంది. ఈ క్రమంలో ఫలితాలపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ హరియాణాలో పరాజయంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. ఈ అనూహ్య ఫలితాలను తాము విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. జమ్మూకశ్మీర్ ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గెలుపు మన రాజ్యాంగం సాధించిన విజయం. ప్రజాస్వామ్య ఆత్మగౌరవానికి దక్కిన విజయం. ఇక హరియాణాలో అనూహ్య ఫలితాలపై మేం విశ్లేషణ చేపట్టాం. చాలా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం. హరియాణాలో పార్టీ కోసం నిరంతరం పనిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజల హక్కులు, సామాజిక, ఆర్థికన్యాయం, నిజం కోసం మా పోరాటం కొనసాగుతుంది. ప్రజల గళాన్ని మేం వినిపిస్తూనే ఉంటాం అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు. హరియాణాలో వరుసగా మూడోసారి భాజపా విజయం సాధించింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో 90 సీట్లకు గానూ 48 చోట్ల జయకేతనం ఎగురవేసింది. ఉదయం కౌంటింగ్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నట్లు కనిపించింది. గంట తర్వాత క్రమంగా ఫలితాలు తారుమారవడం ప్రారంభించి చివరకు భాజపా విజయం సాధించింది. కాంగ్రెస్ 37 సీట్ల వద్దే ఆగిపోయింది. కొన్నిచోట్ల మెజారిటీలు అత్యల్పంగా నమోదవడంతో రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా స్వల్పంగానే ఉంది. దీంతో ఈ ఫలితాలపై కాంగ్రెస్ నేతలు అనుమానాలు వ్యక్తంచేశారు. ఈసీ పనితీరుతో పాటు ఈవీఎంల పైనా ఆరోపణలు చేశారు. మరోవైపు జమ్మూకశ్మీర్ లో ఇండియా కూటమి ఘన విజయం సాధించింది. ఆర్టికల్ 370 రద్దు, కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్‌సీ, కాంగ్రెస్ కూటమి అధికారాన్ని చేజిక్కించుకుంది. కూటమిలోని ఎన్‌సీ 42, కాంగ్రెస్ 6, సీపీఎం 1 సీటును గెలుచుకున్నాయి. భాజపా 29 సీట్లతో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది.

## నిబంధనలకు విరుద్ధంగా వైకాపా నేతకు దర్శనం

### అంతరాయల దర్శనం చేయించిన ఉద్యోగి

### గుర్తించి సస్పెండ్ చేసిన ఇవో

**విజయవాడ, (క్రైమ్ మిర్రర్):** ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారి జన్మనక్షత్ర మూలానక్షత్రం కావడంతో బుధవారం దుర్గగుడికి భక్తులు పోటెత్తారు. సరస్వతీ దేవీ అలంకరణలో ఉన్న దుర్గమ్మను దర్శించు కునేందుకు గత రాత్రి నుంచే భక్తులు క్యూలైన్లలో వేచి చూస్తున్నారు. మూలానక్షత్రం కావడంతో అంతరాలయం దర్శనాలను అధికారులు నిలిపివేశారు. అయితే ఉన్నతాధికారుల ఆదేశాలను బేకాతరు చేస్తూ ఓ వ్యక్తిని అంతరాలయం దర్శనానికి అనుమతించిన అధికారిపై వేటు పడింది. దుర్గగుడి సీనియర్ అసిస్టెంట్ రత్నారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఈవో ఆదేశాలు జారీ చేశారు. మూలా నక్షత్రం రోజున వైసీపీ నేతకు రత్నారెడ్డి అంతరాలయం దర్శనం చేయించారు. అంతరాలయం ముందున్న గేటు తాళాలు తీసి మరీ వైసీపీ నేతకు దర్శనం చేసుకునేందుకు అనుమతిచ్చారు. ఈ వ్యవహారం మొత్తం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. దీన్ని గుర్తించిన ఉన్నతాధికారులు వెంటనే సీనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకున్నారు. రత్నారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఈవో ఆదేశాలు ఇచ్చారు. రత్నారెడ్డితో పాటు మరో ఇద్దరిని కూడా సస్పెండ్ చేస్తూ ఈవో ఆదేశాలు జారీ చేశారు.



# అసలు కథంతా పార్ట్-2లోనే ఉంది


కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా నటించిన సినిమా 'దేవర'ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి మంచి విజయాన్ని అందుకొని ఎన్టీఆర్ అభిమానుల్లో జోష్ నింపింది. దీనికి కొనసాగింపుగా పార్ట్ 2 రానుందని దర్శకుడు గతంలోనే ప్రకటించారు. తాజాగా కొరటాల శివ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'దేవర 2' గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. దీంతో అభిమానుల అంచనాలు రెట్టింపయ్యాయి. 'పార్ట్ 2లో జాన్వీ పాత్ర అసాధారణంగా ఉంటుంది. ఆశ్చర్యపోతారు. మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. సినిమా చూసే ప్రేక్షకులు సీట్ ఎడ్జికి వస్తారు. ఒక దర్శకుడిగా నేను పార్ట్ 2 విషయంలోనూ ఎంతో నమ్మకంగా, ఆసక్తిగా ఉన్నాను. కథలో అసలు మలుపు పార్ట్ 2లోనే ఉంది. ప్రతీ పాత్ర హైలో ఉంటుంది. ఎన్టీఆర్ అభిమానులందరికీ ఒక్కటే చెబుతున్నా.. పార్ట్1లో మీరు చూసింది 10 శాతమే.. రెండో భాగంలో 100శాతం చూస్తారు. ప్రతీ పాత్రలో ట్విస్ట్ ఉంటుంది. కొన్ని సన్నివేశాలు మీరు జీవితంలో మర్చిపోలేని అనుభూతిని అందిస్తాయి. ఈ విషయంలో ప్రామిస్ చేస్తున్నాను. తారక్ నటన గురించి చెప్పాల్సిన అవసరం లేదు.



# గేమ్ చేంజర్ టీజర్ డేట్ ఛేంజ్

## దసరాకు కాదు...దీపావాళికి అంటూ తమన్ పోస్ట్

రామ్‌చరణ్- శంకర్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'గేమ్ ఛేంజర్' టీజర్ దసరాకు రావడం లేదు. దీపావళికి వస్తుందని తాజాగా దీనిపై సంగీత దర్శకుడు తమన్ పోస్ట్ పెట్టారు. టీజర్ కోసం అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు. దసరాకు టీజర్ రాలేదని నిరాశపడొద్దు ఫ్రెండ్స్. టీమ్ నిరంతరం ఆ పనుల్లోనే ఉంది. ప్రతినెలా ఒక లిరికల్ పాటను విడుదల చేయడం కోసం అన్ని పాటలకు లిరిక్స్ వర్క్ పూర్తి చేశాం. ఈ నెలలో అక్టోబర్ 30న ఒక పాట రానుంది. సినిమా డిసెంబర్ 20న కచ్చితంగా మీ ముందుకువస్తుంది' అని పోస్ట్ పెట్టారు. 'రా మచ్చా..' సాంగ్ వంద మిలియన్ల వ్యూస్‌ను సెలబ్రేట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఇక ఓ నెటిజన్‌కు రిప్లై ఇస్తూ.. దీపావళికి టీజర్ ఉంటుందన్నారు. 'దీని టీజర్ కోసం ఎంతోమంది ఎదురు చూస్తున్నారని మేం అర్థం చేసుకోగలం. ఇది చాలా పెద్ద ప్రాజెక్ట్. అవుట్‌పుట్ కోసం ఎక్కడా రాజీపడడం లేదు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. దసరాకు విడుదల కాకపోతే దీపావళికి టీజర్ ఉంటుంది. దీనికి సంబంధించిన అప్‌డేట్స్ నేను ఎప్పటికప్పుడు అందిస్తుంటాను. మీరంతా అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా' అని అన్నారు. 'గేమ్ ఛేంజర్' విషయానికొస్తే.. పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో ఇది సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అడ్వాణీ హీరోయిన్.





# వెంకీ మూవీ సీరియల్ పై శ్రీను వైట్ల ఆసక్తి

రవితేజ హీరోగా శ్రీనువైట్ల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వెంకీ' 2004లో విడుదలైన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకోవడమే కాదు.. ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. అందులోని పలు సన్నివేశాలను తలచుకోవడమే ఆలస్యం ప్రేక్షకుల ముఖాల్లో నవ్వులు పూస్తాయి. తాజాగా ఈ సినిమా సీక్వెల్ ఏ హీరోతో చేస్తారనే ప్రశ్నకు శ్రీను వైట్ల సమాధానమిచ్చారు. ఆయన తాజా చిత్రం 'విశ్వం' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో 'వెంకీ' గురించి మాట్లాడారు. వెంకీ' సీక్వెల్ ఎవరితో చేస్తాననేది చెప్పడం కష్టం. అందులో నటించే హీరో కచ్చితంగా నాకు మంచి స్నేహితుడై ఉండాలి. రవితేజ నాకు మంచి ఫ్రెండ్ కాబట్టి ఆ సినిమా అంత బాగా వచ్చింది. నేను ఏ హీరోతో చేసినా వాళ్లు నాకు స్నేహితులు అవుతారు. అలాంటి రిలేషన్ ఉన్నప్పడే సినిమా బాగా వస్తుంది. ప్రస్తుతం చాలామంది టాలెంటెడ్ హీరోలు ఉన్నారు. వాళ్లందరూ కామెడీతో అలరిస్తున్నారు. వాళ్లలో ఎవరికైనా దీని సీక్వెల్ సెట్ అవుతుంది. ఒకరి పేరు చెప్పడం కష్టం అని చెప్పారు. 2004 మార్చి 26న విడుదలైన వెంకీ సంచలనం సృష్టించింది. రవితేజ పోషించిన వెంకీ పాత్ర, హీరోయిన్ స్నేహ నటించిన శ్రావణి పాత్ర ప్రేక్షకుల హృదయాల్లో స్థానాన్ని సంపాదించుకున్నాయి. హీరో ఫ్రెండ్స్ గ్యాంగ్ అలాగే గజాలాగా బ్రహ్మనందం, బొక్కా సుబ్బారావుగా ఏవీఎస్.. ఇలా ప్రతిఒక్కరూ వారి కామెడీతో అదరగొట్టారు. ముఖ్యంగా ట్రైన్ సీక్వెన్స్ సినిమాకే హైలైట్‌గా నిలిచింది. ఇప్పటికీ ఈ సినిమా దృశ్యాలు సోషల్ మీడియాలో షేర్ అవుతూనే ఉన్నాయి. దీనికి సీక్వెల్ రావాలని ఎంతోమంది కోరుకుంటున్నారు.



# పుష్ప-2 కోసం శరవేగంగా షూటింగ్

మూడేళ్ళుగా బన్నీ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న చిత్రం పుష్ప 2..అనేక కారణాల వల్ల ఈ సినిమా షూట్ ఆలస్యం అవుతూ వచ్చింది. ఈ క్రమంలో సినిమా రిలీజ్ డేట్ కూడా రెండు మూడు సార్లు మార్చారు. అందరి అభిమాన స్టార్ హీరోల నుండి సినిమాలు వస్తున్న బన్నీ ఫ్యాన్స్ కళ్ళు మాత్రం కాయలు కట్టాయి. ఈ నేపథ్యంలోనే దర్శకుడు సుకుమార్ సినిమాని జెట్ స్పీడ్‌లో ముందుకు తీసుకెళ్తున్నాడు. ఓ వైపు గ్లిమ్స్, సాంగ్స్ అప్డేట్స్‌కి మంచి ఆదరణ లభించగా.. మరో రెండు వండర్ ఫుల్ అప్డేట్స్ ఫ్యాన్స్‌లో జోష్ పెంచుతున్నాయి. పుష్ప మేకర్స్ ఇప్పటికే ఈ సినిమాని డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో షూటింగ్ లో వేగం పెంచిన దర్శకుడు సుకుమార్.. ఫస్ట్ హాఫ్ ఎడిట్ కాపీని లాక్ చేశారట. ఇక సెకండ్ హాఫ్ లో మిగిలి ఉన్న కొన్ని సన్నివేశాల షూట్ కోసం మూడు యూనిట్లు పనిచేస్తున్నాయి. ఇందులో ఒక యూనిట్ రంపచోడవరంలో పని చేస్తుండగా మరో రెండు యూనిట్లు వైజాగ్, యానాంలో పని చేస్తున్నాయి. ఎట్టకేలకు సినిమా రిలీజ్ దగ్గరపడటం, షూటింగ్ చకచకా సాగుతుండటం అభిమానులలో జోష్ పెంచింది. పుష్ప 1లో ఉన్న క్యారెక్టర్లనే ఈ సినిమాలో కొనసాగిస్తుండగా జగపతి బాబు అడిషినల్‌గా యాడ్ అయ్యారు. ఇక సినిమాలో ఒక ప్రత్యేకమైన ఐటమ్ సాంగ్ కోసం మొదట శ్రీలీలను సంప్రదించిన దిశా పటానిని ఓకే చేశారు. అయితే ఈ సినిమాలోని ఒక

పోస్టర్ విషయానికొస్తే.. ఎర్ర చందనం వ్యాపారాన్ని చిటికెన వేలుపై నిలబెట్టి చేయడగలడని సూచనగా దాన్ని హైలైట్ చేస్తున్నట్టు వినిపిస్తోంది. సుకుమార్ తెరకెక్కించే ప్రతి సీన్‌కు ఓ లాజిక్, కొన్ని రిఫరెన్స్‌లు ఉంటాయి. 'రంగస్థలం'లో జగపతిబాబు పాత్రకు పాముని రిఫరెన్స్‌గా తీసుకున్నారు. సినిమా ప్రారంభంలో పామును ఏ విధంగా అయితే కొట్టి చంపుతారో అలాగే జగపతిబాబుని కూడా అలాగే కొట్టి చంపినట్లు చూపించారు. మరి ఇప్పుడు అల్లు గోరును హైలైట్ చేయడం వెనుక ఏముందో సుకుమార్

# ప్రేక్షకులకు నవ్వు ఆగదు: గోపీచంద్



"విశ్వం' చిత్రం షూటింగ్‌లో ప్రతి సన్నివేశం చేసేటప్పుడు నవ్వుకుంటూనే ఉన్నాం. వినోదం, యాక్షన్ అద్భుతంగా వచ్చాయి. థియేటర్లో కూర్చున్న ప్రేక్షకులకు నవ్వు ఆగదు... చాలా ఎంజాయ్ చేస్తారు. ఒక్క మాట చెప్పగలను... శ్రీను వైట్లగారు ఈజ్ బ్యాక్ విత్ బ్యాంగ్" అని గోపీచంద్ అన్నారు. శ్రీను వైట్ల దర్శకత్వంలో గోపీచంద్, కావ్యా థాపర్ జంటగా నటించిన చిత్రం 'విశ్వం'. దోనేపూడి చక్రపాణి సమర్పణలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, చిత్రాలయం స్టూడియోస్‌పై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో గోపీచంద్ మాట్లాడుతూ%-% "శ్రీను వైట్లగారి సినిమా లో ఎంత వినోదం ఆశిస్తారో... అంతకు మించి ఇవ్వడానికి ఆయన 'విశ్వం' స్క్రిప్ట్‌పై దాదాపు 7 నెలలు పని చేశారు. నేను చాలా సినిమాలు చేశాను. ఆయన వద్ద ఉండే సౌకర్యం ఎక్కడా ఫీల్ అవ్వలేదు. రాజీ పడకుండా ఈ సినిమా తీసిన విశ్వప్రసాద్, చక్రపాణిగార్లకు కృతజ్ఞతలు" అని తెలిపారు.

# రజనీకాంత్ సూచనతో ..వేట్టయాన్..కథలో మార్పు



రజనీకాంత్ హీరోగా టి.జె.జ్ఞానవేల్ తెరకెక్కించిన చిత్రం 'వేట్టయన్' భారీ అంచనాల మధ్య దసరా కానుకగా అక్టోబర్ 10న విడుదల కానుంది. ఈనేపథ్యంలో ఈ సినిమా కథ గురించి రజనీ ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. టి.జె.జ్ఞానవేల్ మొదట తీసుకువచ్చిన కథకు రజనీ మార్పులు సూచించారట. దానిలో కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయమని కోరారట. కుమార్తె సౌందర్య సిఫార్సు మేరకు రజనీకాంత్ 'వేట్టయన్' కథను విన్నట్లు చెప్పారు. 'టి.జె.జ్ఞానవేల్ దర్శకత్వంలో వచ్చిన 'జైభీమ్' సినిమా నాకెంతో నచ్చింది. కానీ, గతంలో జ్ఞానవేల్‌తో ఎప్పుడూ మాట్లాడే అవకాశం రాలేదు. 'వేట్టయన్' కథ వినమని సౌందర్య నాకు చెప్పడంతో విన్నాను. బాగుందనిపించింది. అయితే, ఈ సినిమా తీయడానికి చాలా డబ్బు ఖర్చవుతుంది. అందుకే కథలో కొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయాలని కోరాను. 10 రోజుల సమయం అడిగాడు. 'కమర్షియల్ సినిమాగా మారుస్తాను. కానీ, నెల్సన్ దిలీప్‌కుమార్, లోకేశ్ కనగరాజ్‌ల సినిమాగా మార్చలేను. నా శైలిలో ప్రేక్షకులకు నచ్చేలా ఈ కథను మారుస్తాను' అని జ్ఞానవేల్ చెప్పాడు. 'నాకు అదే కావాలి.. లేదంటే లోకేశ్, దిలీప్‌ల దగ్గరకే వెళ్లేవాడిని కదా' అని చెప్పా. 10 రోజుల తర్వాత కథలో మార్పులు చేసి తీసుకొచ్చాడు. అది చూసి నేను ఆశ్చర్యపోయాను' అని రజనీకాంత్ తెలిపారు. ఈ సినిమాకు అనిరుధ్ మాత్రమే సంగీత దర్శకుడిగా ఉండాలని జ్ఞానవేల్ పట్టుపట్టినట్లు రజనీ గుర్తుచేసుకున్నారు. తమిళనాడులో గతంలో జరిగిన ఓ బూటకపు ఎన్‌కౌంటర్ నేపథ్యంతో దర్శకుడు టి.జె.జ్ఞానవేల్ ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఇది రజనీకాంత్‌కు 170వ చిత్రం. ఆయన ఇందులో రిటైర్డ్ పోలీసు అధికారిగా కనిపించనున్నట్టు సమాచారం. అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా, రితికాసింగ్, మంజు వారియర్, దుషారా విజయన్ కీలకపాత్రలు పోషించారు. తెలుగులోనూ అదే పేరుతో విడుదల కానుంది.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.